మంగళవారం
08-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 108
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్ మూల్యం చెల్లించుకోక తప్పదు: టర్కీ

ఇస్తాంబుల్: గాజాలో నరమేధానికి ఇజ్రాయిల్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ సోమవారం హెచ్చరించారు. పలస్తీనా పౌరులు లక్ష్యంగా గాజాస్ట్రిప్‌లో యుద్ధోన్మాదంతో ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించి ఈ నెల 7వ తేదీనాటికి ఏడాది దాటిన విషయం తెలిసిందే. ఏడాదిగా కొనసాగిస్తున్న, ఇప్పటికీ కొనసాగుతున్న ఈ మారణహోమానికి ఇజ్రాయిల్ త్వరలో లేదా భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సిందేనని మర్చిపోకూడదని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూని హిట్లర్‌తో పోల్చడంతో పాటు ఆయనను 'గాజా కసాయి' అని విమర్శించారు.

'నీట్' ప్రశ్నాపత్రం కోసం 144 మంది డబ్బులిచ్చారు

న్యూదిల్లీ: నీట్ యూజీ 2024 ప్రశ్నాపత్రం లీక్ కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ కీలక విషయాలు గుర్తించింది. ఈ వ్యవహారంలో మొత్తంగా 144 మంది అభ్యర్థులు డబ్బులు చెల్లించినట్లు తేల్చింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ గతవారం మూడో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. పరీక్ష జరగడానికి కొద్ది గంటల ముందే జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్ నుంచి పంకజ్ కుమార్ అనే వ్యక్తి చేతుల మీదుగా నీట్ ప్రశ్నాపత్రం లీకైనట్లు సీబీఐ గుర్తించింది. ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్

- మిగతా 2 లో

ఆర్‌జీ కర్ హత్యాచారం కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్

న్యూదిల్లీ : కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌పై సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. ఆగస్టు 9న విరామ సమయంలో ఆస్పత్రి సెమినార్ గదిలో బాధితురాలు నిద్రిస్తున్నప్పుడు, స్థానిక పోలీసులతో కలిసి పౌర వలంటీరుగా పని చేస్తున్న సంజయ్ రాయ్ ఈ నేరానికి

- మిగతా 2 లో

లాలు, తేజస్వికి ఊరట

న్యూదిల్లీ: ఉద్యోగానికి భూమి కేసులో తొమ్మిది మంది నిందితులకు రూ.లక్ష పూచీకత్తుపై దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వీరిలో లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారులు తేజస్వి, తేజ్ ప్రతాప్ యాదవ్ సహా ఇతర నిందితులు ఉన్నారు. ఒక్కో నిందితుడికి లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నిందితులందరూ తమ పాస్‌పోర్టులు అప్పగించాలని కోర్టు ఆదేశించింది. దేశం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పండక్కి కొన్న సరుకులంతా కల్తీ, మా కోసం కూడా ప్రాయశ్చిత్త దీక్ష చేయండి సారు!

యుద్ధం ఆపండి

పలస్తీనా సంఘీభావసభలో వామపక్ష అగ్రనేతలు

న్యూదిల్లీ: యుద్ధోన్మాద ఇజ్రాయిల్, అమెరికా దేశాలు పశ్చిమాసియాలో తక్షణమే యుద్ధం ఆపాలని కోరుతూ వామపక్షాలు న్యూదిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సోమవారం పలస్తీనా సంఘీభావ సభ నిర్వహించాయి. ఈ సభకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్ కారత్, సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఏఐఎఫ్‌బీ నేత జి.దేవరాజన్, ఆర్ఎస్‌పీ నేత ఆర్ఎస్ దగార్, ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. సీపీఐ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, బీకే కాంగో, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి అనీ రాజా తదితరులు పాల్గొన్నారు. డి.రాజా ప్రసంగిస్తూ తక్షణమే గాజా, లెబనాన్‌లో కాల్పుల విరమణ జరపాలని ఇజ్రాయిల్‌ను డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌కు మద్దతిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. యుద్ధం ప్రారంభమై ఏడాది గడిచిందని, గాజాలో 42 వేల మంది హతమయ్యారని, వాస్తవ లెక్కలు మరింత ఎక్కువ ఉంటాయని అన్నారు. ఇందులో అత్యధికులు మహిళలు, చిన్నారులేనని తెలిపారు. మరోవైపు లెబనాన్, ఇరాన్‌పై యుద్ధానికి ఇజ్రాయిల్ కాలు దువ్వుతుంటే, అమెరికా వెన్నుదన్నుగా నిలబడుతోందని ఆయన మండిపడ్డారు. ప్రకాశ్ కారత్ మాట్లాడుతూ పలస్తీనా వాసులందరినీ హతమార్చేందుకే గాజాలో మారణహోమం సాగుతోందన్నారు. గాజా, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు ఉధృతమవుతున్నాయని, ఎవరూ ఆ దేశాన్ని ఆపడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం ఇజ్రాయిల్ వైపు నిలుస్తూ...

- మిగతా 2 లో

పోలవరం ఇక పరుగులే

- సవరించిన అంచనాలకు కేంద్రం ఓకే
- మోదీకి సీఎం చంద్రబాబు ప్రత్యేక కృతజ్ఞతలు
- ప్రధానితో చర్చలు ఫలవంతమంటూ ట్వీట్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఇక పరుగులు పెట్టనుంది. కొన్ని సంవత్సరాలుగా ప్రాజెక్టు అంచనా వ్యయం పెంపుపై కేంద్రం ఊగిసలాడి ధోరణి కొనసాగుతున్న వేళ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే దిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్రమోదీకి పోలవరం, అమరావతి రాజధాని ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ప్రధాని కూడా హామీ ఇచ్చారు. దీంతో పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనిపై రెండు రోజుల హస్తిన పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా ప్రధాని నివాసానికి వెళ్లి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి దిల్లీ వెళ్లిన చంద్రబాబు... మోదీతో గంటకు పైగా సమావేశమయ్యారు. అమరావతి, పోలవరం నిధులు, రాష్ట్రంలో వివిధ రహదారుల అభివృద్ధి, రైల్వేజోన్ శంకుస్థాపన, సెయిల్‌లో విశాఖ స్టీల్ విలీనం, వరద బాధితులను ఆదుకొనేందుకు కేంద్రం నుంచి సాయం తదితర అంశాలను చర్చించినట్లు తెలిసింది. పెండింగ్‌లో ఉన్న విభజన హామీలు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచబ్యాంకు అధ్వర్యాన రూ.15 వేల కోట్ల నిధులు ఆర్థిక సహాయం చేయడం, పోలవరానికి సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, వరద బాధితులకు సహాయం అందించడం పట్ల ప్రధానికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానితో భేటీ అయిన తదుపరి చంద్రబాబు ఎక్స్ వేదికగా తన స్పందన తెలిపారు. మోదీతో చర్చలు ఫలవంతగా జరిగాయని వెల్లడించారు. పోలవరం సవరించిన వ్యయ అంచనాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలను ప్రధానికి వివరించానని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొనే విషయంలో కేంద్రం సంపూర్ణ మద్దతు ఇస్తుంది. అమరావతి రాజధానికి ప్రధానమంత్రి అందిస్తున్న మద్దతును అభినందిస్తున్నానంటూ చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధాని, చంద్రబాబు మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. అనంతరం రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. విశాఖ రైల్వేజోన్ ప్రారంభానికి ముహూర్తంపై చర్చించారు. సోమవారం రాత్రికి దిల్లీలోనే బస చేయనున్న సీఎం... మంగళవారం ఉదయం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ కానున్నారు. అమరావతి రాజధాని ఔటర్‌రింగ్‌రోడ్డు, అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే, విజయవాడ నుంచి నిడమానూరు వరకు ఫ్లై ఓవర్ కొనసాగింపు తదితర కీలక ప్రాజెక్టులపై ఆయనతో చంద్రబాబు చర్చించనున్నారు.

ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై వేటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై ప్రభుత్వం వేటు వేసింది. సాధారణ పరిపాలనశాఖ రాజకీయ కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీజేశారు. గత ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సునీల్‌కుమార్‌పై అఖిల భారత సర్వీసు నిబంధనలు 1969 ప్రకారం ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు జీవో 1695 విడుదల చేసింది. తన వివరణను లిఖిత పూర్వకంగా గానీ లేదా వ్యక్తిగతంగా గాని 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొంది. రాజకీయ ఒత్తిడి తెస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వెల్లడించింది. సోషల్ మీడియా ద్వారా సునీల్‌కుమార్ చేసిన ఆరోపణలపై గుంటూరుజిల్లా నగరపాలెం పోలీస్‌స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జులై 12న ప్రభుత్వంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినట్లు రఘురామ

- మిగతా 2 లో

నేడు హర్యానా, కశ్మీర్ ఎన్నికల ఫలితాలు

న్యూదిల్లీ: హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఉదయం పదకొండు గంటల కల్లా తొలి ఫలితం వెల్లడి కానుంది. లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. హర్యానా లో 90 శాసనసభ స్థానాలు ఉండగా 1031 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. హ్యాట్రిక్ విజయం తమదేనని అధికార బీజేపీ ధీమా వ్యక్తం చేస్తుండగా ఈసారి మార్పు ఖాయమని కాంగ్రెస్ పూర్తి నమ్మకంతో ఉంది. హర్యానా హస్తం పార్టీదేనని ఎగ్జిట్ పోల్స్ కూడా అంచనా వేశాయి. బీజేపీ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, ఐఎన్ఎల్‌డీ -బీఎస్‌పీ, జేజేపీ-ఆజాద్ సమాజ్ పార్టీ ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. అయితే బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ జరిగింది. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 5న పోలింగ్ జరగ్గా 1031 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 2 కోట్ల మందికిపైగా ఓటర్లలో 67.90 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక జమ్మూకశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అందరికీ ఆసక్తి ఉంది. నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి తప్పక విజయం సాధిస్తుందని భావిస్తున్నారు.

ఆ రెండు ఇండియా ఐక్యసంఘటనలో ఉన్న పార్టీలే. ఇక పీడీపీ... కింగ్ మేకర్‌గా ఆవిర్భవించడం ఖాయమని భావిస్తోంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మొత్తం 90 స్థానాలు ఉండగా.. మూడు దశల్లో పోలింగ్ (సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1) జరిగింది. కాగా కశ్మీర్‌లో ఏ పార్టీకి మెజార్టీ రాబోదని ... హంగ్ అసెంబ్లీ ఏర్పడే అవకాశాలున్నట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.

హమాస్ దాడి ఆపడంలో విఫలమయ్యాం 2లో

శిక్షణ ఎవరి కోసం?

- ప్రభుత్వ కళాశాలల్లో 'కార్పొరేట్' ఎంట్రీ
- ఐఐటీ, నీట్ కోచింగ్ బాధ్యతలు
- ఇంటర్ బోర్డు ఏకపక్ష నిర్ణయంపై అనుమానాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోకి ఐఐటీ, నీట్ శిక్షణ పేరుతో ఓ కార్పొరేట్ విద్యా సంస్థ ప్రవేశించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభావంతులను గుర్తించి, వారికి ఐఐటీ, నీట్ శిక్షణ ఇప్పించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఈ నిర్ణయం మంచిదే అయినప్పటికీ... ఓ కార్పొరేట్ విద్యాసంస్థకు అప్పగించడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యా వ్యాపారం చేస్తున్న ఓ సంస్థకు ఇలాంటి బాధ్యతలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. నెల్లూరుజిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 50మంది ఇంటర్ విద్యార్థులను ఎంపిక చేసి... అక్కడే ఉన్న కార్పొరేట్ యాజమాన్య కళాశాలలకు రోజువారీ శిక్షణకు పంపేందుకు బోర్డు నిర్ణయించింది. తద్వారా విజయవాడ, ఏలూరు, గుంటూరు, తిరుపతి తదితర నగరాల్లో ఈ కార్పొరేట్ విద్యా సంస్థల నేతృత్వంలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో ఇంటర్ విద్యలో గందరగోళం ఏర్పడుతుందన్న విమర్శలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 246 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. ఇందులో 5వేలకుపైగా లెక్చరర్ల ఖాళీలున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న లెక్చరర్లలో అత్యధికంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలోనే ఉన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యధికంగా ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు ఆర్థికంగా వెనుకబాటుకు గురైన పేద విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. వారికి ఐఐటీ, నీట్ శిక్షణ పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థ యాజమాన్యాలతో బోర్డు అధికారులు ఏకపక్ష ఒప్పందాలు చేసుకోవడంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది కేవలం

- మిగతా 2 లో

జమ్మూకశ్మీర్‌లో 'నామినేటెడ్' మంటలు

- ప్రభుత్వ ఏర్పాటులో ఆ ఐదుగురి ఓట్లు కీలకం
- ఎల్జీకి సిఫార్సుచేసే అధికారం మంత్రివర్గానిదే: 'ఇండియా' నేతలు

జమ్మూకశ్మీర్‌లో నామినేటెడ్ ఎమ్మెల్యేల వ్యవహారం అగ్గి రాజేస్తోంది. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్న తరుణంలో ఇక్కడ ఏ పార్టీకి మెజారిటీ రాదని... హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఈ క్రమంలోనే అవసరమైతే నామినేటెడ్ సభ్యులను అడ్డం పెట్టుకోనైనా బీజేపీ కుతంత్రాలకు తెరలేపుతున్నట్లు విపక్ష ఇండియా ఐక్యసంఘటన కూటమి విమర్శలు ఎక్కుపెట్టింది.

2లో

విలీనంతో విచ్ఛిన్నం!

- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- సర్కారు చర్యలు బడులకు శాపం
- మూడేళ్లలో 15 వేలకు తగ్గిన నమోదు
- ప్రతిరోజు 67 వేల మంది గైర్హాజరు
- శాశ్వతంగా మూతబడిన 482 స్కూళ్లు

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: ఏలూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది. పాఠశాలల విలీనం... రద్దు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ... తదితర అంశాలపై ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. ఉచితంగా షూస్, యూనిఫామ్, టై, బెల్ట్ , నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, అమ్మకు వందనం, టాబ్‌లు ఇస్తున్నామని చెబుతున్నా... విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉంది. రెండేళ్ల క్రితం చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియ సర్కారు బడికి శాపంగా మారింది. ప్రాథమిక పాఠశాలలను అర్థంతరంగా విడగొట్టేశారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోగల ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండు తరగతులు బోధించడానికి అధికశాతం మంది ఉపాధ్యాయులు ఉంటున్నారు. కానీ ఆయా తరగతులలో 20 మంది లోపే విద్యార్థులు ఉంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో మూడు , నాలుగు, ఐదు తరగతుల బోధనకు ఉపాధ్యాయులను కేటాయించలేదు. దీంతో ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, 10 తరగతుల బోధనతో పాటు స్కూల్ అసిస్టెంట్లకు మూడు , నాలుగు, ఐదు తరగతుల బోధన అదనపు భారంగా మారింది. మూడు,నాలుగు,ఐదు తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. కానీ అందుకు సరిపడా ఉపాధ్యాయులను మాత్రం కేటాయించకుండా అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ విధంగా ప్రాథమిక పాఠశాలలను విలీనం పేరుతో విచ్ఛిన్నం చేయడం వలన పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. ఈ కారణంగానే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య మూడేళ్ల కాలంలో లక్షన్నరకు పైగా

- మిగతా 2 లో

వైద్యశాస్త్రంలో ఇద్దరికి నోబెల్

స్టాక్‌హోమ్: వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకుగాను అమెరికా శాస్త్రవేత్తలు విక్టర్ అంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌ను ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం వరించింది. మైక్రో ఆర్ఎన్ఏ, పోస్టు ట్రాన్‌స్క్రిప్షనల్ జీన్ రెగ్యులేషన్‌లో దాని పాత్రను కొనుగొన్నందుకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో ఉన్న కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లోని నోబెల్ బృందం ఈ పురస్కారాలు ప్రకటించింది. కోవిడ్-19 వ్యాక్సిన్ అభివృద్ధి చేసినందుకుగాను హంగేరీ అమెరికన్ కాటలిన్ కరికో, అమెరికాకు చెందిన డ్రూ వెయిస్‌మన్‌లకు గతేడాది వైద్యశాస్త్రంలో నోబెల్ లభించింది. వైద్యశాస్త్రంలో మొత్తంగా ఇప్పటి వరకు నోబెల్ బహుమతిని 114 సార్లు ప్రకటించగా... 227 మంది అందుకున్నారు. ఇందులో కేవలం 13 మంది మాత్రమే మహిళలు ఉన్నారు. వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబరు 14 వరకు కొనసాగనుంది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య

- మిగతా 2 లో

హమాస్ దాడి ఆపడంలో విఫలమయ్యాం

ఇజ్రాయిల్ సైన్యం అంగీకారం

టెల్అవీవ్: గతేడాది అక్టోబర్ 7వ తేదీన హమాస్ దాడిని నిలువరించడంలో తాము విఫలమయ్యామని ఇజ్రాయిల్ సైన్యం అంగీకరించింది. ఇజ్రాయిల్-హమాస్ మధ్య ఘర్షణ ప్రారంభమై ఏడాది దాటిన సందర్భంగా ఆ దేశ ఆర్మీ అధికారి హెర్జి హలెవీ ప్రత్యేక సందేశం విడుదల చేశారు. 'ఇది సుదీర్ఘ యుద్ధం. ఇది సైనిక సామర్థ్యాలే కాదు... మానసిక శక్తిని... దీర్ఘకాలం పోరాడే సామర్థ్యాన్ని పరీక్షిస్తుంది. ప్రతిరోజు, వారం, నెలా గడిచేకొద్దీ శత్రువుల పరిస్థితి ఘోరంగా తయారవుతోంది. అక్టోబర్ 7కు దాడి జరిగి ఏడాది పూర్తయింది. ఆరోజు ప్రజలను కాపాడాల్సిన బాధ్యతల్లో మేము విఫలమయ్యాం. మన దేశాన్ని నాశనం చేయాలని చూసేవారు ఎప్పటికీ కోలుకోలేరని తెలుసుకోవాలి. దేశానికి ఒక తరం యోధులు, కమాండర్లు యుద్ధంతో చాలా అనుభవాన్ని సంపాదించారు. హమాస్ సైనిక విభాగాన్ని పూర్తిగా ఓడించాం. కానీ, ఉగ్రవాద సామర్థ్యాలతో పోరాటం కొనసాగుతుంది. హెజ్బుల్లా సీనియర్ నాయకత్వం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది' అని హెర్జి హలెవీ తన సందేశంలో పేర్కొన్నారు. ఓవైపు గతేడాది అక్టోబర్ 7న హమాస్ చేతిలో బందీగా మారిన ఇడాన్ స్టీవీ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయినట్లు సోమవారం ఇజ్రాయిల్ ప్రకటించింది. ప్రస్తుతం అతడి మృతదేహం కూడా హమాస్ వద్దే ఉందని పేర్కొంది. నోవా ఫెస్టివల్‌లో ఫొటోగ్రఫీ కోసం స్టీవీ అక్కడికి వెళ్లగా... హమాస్ దళాలు దాడి చేయడంతో తన ఇద్దరు మిత్రులతో కారులో తప్పించుకొనే యత్నం చేశాడు. కానీ, వారిని హమాస్ మిలిటెంట్లు అడ్డగించారు. దీంతో మరో మార్గంలో వేగంగా వెళుతున్న వీరి కారు చెట్టును ఢీకొంది. అనంతరం హమాస్ సభ్యులు ఆ వాహనాన్ని చుట్టుముట్టి అతడి మిత్రులను కాల్చి చంపారు. స్టీవీని బంధించారు. ప్రస్తుతం హమాస్ అధీనంలో ఇంకా 97 మంది బందీలు ఉన్నారు.

ఇది 1950ల నాటి కాలం కాదు

పిల్లలు లేరన్న విమర్శలపై హారిస్ దీటైన సమాధానం

వాషింగ్టన్: అర్కాన్సాస్ గవర్నర్ సారా హుకాబీ శాండర్స్ విమర్శలపై అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తీవ్రంగా స్పందించారు. ఇది 1950ల నాటి కాలం కాదని, కుటుంబం అనేది రకరకాలుగా ఏర్పడుతుందని అమెరికా అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ వ్యాఖ్యానించారు. ఉన్న ఇద్దరు పిల్లలను తాను చనిపోయేవరకు ప్రేమిస్తూనే ఉంటానని అన్నారు. హారిస్‌కు పిల్లలు లేరని, అందుకే ఆమె అణకువగా ఉండరని గవర్నర్ సారా హుకాబీ శాండర్స్ విమర్శించారు. దీనిపై కమల తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఈ మేరకు 'కాల్ హర్ డాడీ' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. గతంలోనూ కమల ఈ తరహా వ్యక్తిగత విమర్శలు ఎదుర్కొన్నారు. అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'పిల్లలు లేని మహిళల దైనందిన జీవితం దయనీయంగా ఉంది. వారు దేశాన్ని కూడా అలాగే దయనీయంగా మార్చాలని అనుకుంటారు. ఇది వాస్తవం. కమలా హారిస్‌నే చూడండి. డెమోక్రాట్ల భవిష్యత్తును పిల్లలు లేని వ్యక్తులు నియంత్రిస్తున్నారు. దేశానికి సంబంధించి ప్రత్యక్ష వాటా లేని ఇలాంటి వ్యక్తుల చేతిలో అధికారం పెట్టడంలో అర్థం లేదు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఆమెకు కొంతమంది మద్దతుగా స్పందించారు. ఆమె సవతి కుమార్తె... వాన్స్‌కు దీటుగా బదులిచ్చారు. కమలాహారిస్ భర్త పేరు డగ్లస్ ఎంహాఫ్. డగ్లస్, కెర్‌స్టిన్‌కు జన్మించిన పిల్లలే కోలె, ఎల్లా. వారికి కమలతో అనుబంధం ఉంది. దానిని ఉద్దేశించి ఎల్లా స్పందించారు. 'కోలె, నేను ఉండగా మీరు పిల్లలు లేనివారు ఎలా అవుతారు? నా ముగ్గురు తల్లిదండ్రులను నేను ప్రేమిస్తున్నాను' అని ఇన్‌స్టా స్టోరీస్‌లో రాసుకొచ్చారు. ఎల్లా తల్లి కెర్‌స్టిన్ కూడా వాన్స్ వ్యాఖ్యలను ఖండించారు. 'గత పదేళ్లుగా నా పిల్లలు టీనేజ్ వయసులో ఉన్నప్పటినుంచి మాతో పాటు కమల కూడా వారి బాధ్యతలు చూస్తున్నారు. వారిని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఈ కుటుంబంలో ఆమె కూడా ఉన్నందుకు సంతోషంగా ఉంది' అని గతంలో హారిస్‌కు మద్దతు తెలిపారు.

ఇజ్రాయిల్‌పై 26 వేల రాకెట్ల దాడి: ఐడీఎఫ్

టెల్అవీవ్: ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ఐడీఎఫ్ కీలక డేటా ప్రకటించింది. గాజా పట్టీలో 17 వేల మంది హమాస్ ఆపరేటివ్‌లను, ఇజ్రాయిల్‌లో 1,000 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు వెల్లడించింది. ఆ గ్రూప్‌ను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపింది. వీరిలో 30 మంది హమాస్ బెటాలియన్, 165 మంది కంపెనీ కమాండర్లు ఉన్నట్లు తెలిపింది. గాజాపట్టీలో 40,300 లక్ష్యాలపై దాడులు చేశామని, మొత్తం 4,700 సొరంగ ప్రవేశమార్గాలు ధ్వంసమయ్యాయని పేర్కొంది. అక్టోబర్ 8 నుంచి లెబనాన్‌లోని హెజ్బుల్లా కూడా తమపై దాడులు మొదలుపెట్టిందని ఇజ్రాయిల్ సైన్యం చెప్పింది. దీంతో తాము ఎదురుదాడుల్లో ఆ సంస్థకు చెందిన మొత్తం 800 మందిని మట్టుబెట్టగా... వీరిలో 90 మంది టాప్ కమాండర్లు ఉన్నట్లు పేర్కొంది. అదే సమయంలో 11,000 హెజ్బుల్లా స్థావరాలు పేల్చేశామని వివరించింది. ఏడాది వ్యవధిలో 26 వేల రాకెట్లతో దాడులు జరిగాయని, వీటిల్లో గాజా నుంచి 13,200, లెబనాన్ నుంచి 12,400 దూసుకురాగా... మిగిలినవి యెమన్, సిరియా, ఇరాన్ నుంచి ప్రయోగించామని తెలిపింది. వీటిల్లో వందల సంఖ్యలో రాకెట్లు ఆయా ప్రాంతాల్లోనే కూలిపోయినట్లు వెల్లడించింది. మొత్తం 728 మంది తమ సైనికులు, రిజర్విస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పింది. 2023 అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయిల్‌పైకి హమాస్ బలగాలు విరుచుకుపడ్డాయి. నాటి దాడుల్లో మొత్తం 1,200 మంది ఇజ్రాయిలీలు ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో 251 మంది కిడ్నాప్‌నకు గురయ్యారు. వీరిలో కొందరిని విడిపించగా... మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. హమాస్ వద్ద ఇప్పటికీ 100 మంది వరకు బందీలుగానే ఉన్నారు.

జమ్మూకశ్మీర్‌లో 'నామినేటెడ్' మంటలు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో నామినేటెడ్ ఎమ్మెల్యేల వ్యవహారం అగ్గి రాజేస్తోంది. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్న తరుణంలో ఇక్కడ ఏ పార్టీకి మెజారిటీ రాదని... హ ంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఈ క్రమంలోనే అవసరమైతే నామినేటెడ్ సభ్యులను అడ్డం పెట్టుకోనైనా బీజేపీ కుతంత్రాలకు తెరలేపుతున్నట్లు విపక్ష ఇండియా ఐక్యసంఘటన కూటమి విమర్శలు ఎక్కుపెట్టింది. కాగా తొలిసారిగా ఐదుగురు నామినేటెడ్ సభ్యులు ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించనున్నారు. అయితే కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ ప్రభుత్వ ఏర్పాటుకు ముందు ఐదుగురు సభ్యులను నామినేట్ చేయడాన్ని వ్యతిరేకించాయి. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించాయి కూడా. ఈ నెల 8న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ముందుగానే ఐదుగురిని సభకు నామినేట్ చేయాలన్న నిర్ణయంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్య ప్రజాస్వామ్య సూత్రాలు, రాజ్యాంగంపై దాడిగా ఆ పార్టీ నేతలు అభివర్ణించారు. ఐదుగురు ప్రతినిధుల నామినేషన్‌ను ఆమోదించవద్దని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను కోరారు. ప్రభుత్వం ఏర్పాటుకు ముందు ఐదుగురు సభ్యులను ఎల్‌జీ నామినేట్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, జేకేపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రవీందర్ శర్మ తెలిపారు. ఈ చర్యలన్నీ ప్రజాస్వామ్యం, ప్రజల తీర్పు, రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడి చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలను అనుకూలంగా మలుచుకోవడానికి అధికార బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఎదుర్కొంటామని ప్రకటించారు. కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి కచ్చితంగా మెజారిటీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019కి చేసిన సవరణల్లో భాగంగా కేంద్ర హోంశాఖ సూచనల మేరకు ఈ నామినేషన్లను లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదించారు. 2023 జూలై 26న జరిగిన సవరణ ఈ ప్రక్రియకు వీలు కల్పిస్తోంది. కాగా ఐదుగురు సభ్యులను అసెంబ్లీకి నామినేట్ చేయడానికి ఎల్‌జీకి అధికారాలు ఇచ్చేందుకు బీజేపీ నేత ృత్వంలోని కేంద్రం ముందుకు వెళితే తమ పార్టీ సుప్రీంకోర్టుకు వెళ్తుందని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా హెచ్చరించారు. 'ప్రభుత్వం ఏర్పడుతున్నందున ముందుగా లెఫ్టినెంట్ గవర్నర్ ఈ ప్రక్రియకు దూరంగా ఉండాలి. ప్రభుత్వమే వ్యక్తులను నామినేట్ చేసి దానిని ఎల్జీకి పంపడం సాధారణ విధానం. వారు ఏమి చేయాలనుకుంటున్నారో నాకు తెలియదు. అయితే, వారు ఎల్జీకి అధికారులు ఇచ్చినట్లయితే మేము సుప్రీంకోర్టుకు వెళ్తాం. ఎల్జీ ఇక్కడే ఉంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ప్రయోజనం ఏమిటి? వీటన్నింటికీ వ్యతిరేకంగా పోరాడాలి" అని అబ్దుల్లా పేర్కొన్నారు. అసెంబ్లీకి ఐదుగురు సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఇవ్వడం అనేది ఎన్నికల ఫలితాలకు ముందు రిగ్గింగ్ చేయడమేనని పీడీపీ నేత ఇల్తిజా ముఫ్తీ అన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు ముందు ఐదుగురు సభ్యులను నామినేట్ చేస్తే... జమ్మూకశ్మీర్ అసెంబ్లీ బలం 95 అవుతుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ 48 సీట్లకు పెరుగుతుంది. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ పుదుచ్చేరి అసెంబ్లీ మాదిరిగా రూపొందించబడింది. ఇక్కడ ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఎన్నికైన ఎమ్మెల్యేలతో సమానంగా పనిచేస్తారు. ఓటు హక్కును కలిగి ఉంటారు. పుదుచ్చేరి మాజీ ఎల్‌జీ కిరణ్ బేడీ నాటి కాంగ్రెస్ నేత ృత్వంలోని ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ఇద్దరు సభ్యులను అసెంబ్లీకి నామినేట్ చేయడంపై 2017-2018లో తొలుత మద్రాస్ హైకోర్టులో, తరువాత సుప్రీంకోర్టులో సవాలు చేయడం జరిగింది. ఎమ్మెల్యేలను నామినేట్ చేసే ముందు ఎల్‌జీ ముఖ్యమంత్రిని సంప్రదించాలని పుదుచ్చేరి ప్రభుత్వం వాదించింది. అయితే అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. ఎల్‌జీ నామినేట్ చేయడంలో చట్టవిరుద్ధం ఏమీ లేదని తేల్చింది.

విలీనంతో విచ్ఛిన్నం!

(మొదటిపేజీ తరువాయి)

పడిపోయింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2023 మేలో ప్రాథమిక పాఠశాలల విలీనానికి ముందు ఎలిమెంటరీ, యూపీ, హైస్కూళ్లు కలిపి 2,677 ఉండేవి. విలీనం తరువాత తర్వాత ప్రాథమిక పాఠశాలలు 185, యూపీ స్కూళ్లు 16, హైస్కూళ్లు 194 కలిపి 2,195కి పడిపోయింది. అంటే విలీనం తర్వాత 482 స్కూళ్లు శాశ్వతంగా మూతపడ్డాయి అని తెలుస్తోంది.

ఏలూరు జిల్లాలో వివిధ యాజమాన్యాల అజమాయిషీలో గల ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి 10 తరగతులలో 2021 -22 లో 2,74,383 మంది విద్యార్థుల హాజరు నమోదయింది. 2022-23లో 2,76,017 మంది, 2023-24లో 2,65,869 మంది విద్యార్థులు చేరారు. ఇక్కడి వరకు గణాంకాలు బాగానే ఉన్నాయి. కానీ మరింత లోతుగా యాజమాన్యాల వారీగా పరిశీలిస్తే... ఏలూరు జిల్లాలోని 2,195 మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ హైస్కూళ్లలో 2021 -22లో 2,72,767 మంది నమోదయ్యారు. 2022-23లో 1,29,959 మంది, 2023-24లో 1,16,931 మంది విద్యార్థులు చేరారు. మున్సిపల్ స్కూళ్లలో... 2021-22లో 31,405 మంది విద్యార్థులు, 2022-23లో 7,878 మంది, 2023-24లో 6,777 మంది విద్యార్థులు నమోదయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో... ఏలూరు జిల్లాలోని 22 ప్రభుత్వ పాఠశాలలో 2021-22లో 6,511 మంది , 2022-23లో 3,706 మంది, 2023-24లో 3,811 మంది విద్యార్థులు ఉన్నారు. తాజా గణాంకాల ప్రకారం ఏలూరు జిల్లాలోని 1,053 ప్రైవేట్ కాన్వెంట్లలో...2021-22లో 2,00,109 మంది విద్యార్థులు, 2022-23లో 1,14,682 మంది, 2023-24 లో 1,45,438 మంది నమోదైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీటిని బట్టి చూస్తే జడ్పీ, మున్సిపల్, రాష్ట్ర ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల నమోదు గత మూడేళ్ల కాలంలో 15 వేల మందికి తగ్గిపోయిందని తెలుస్తోంది. మధ్యాహ్న భోజన పథకం లెక్కల ప్రకారం ప్రతిరోజు 67 వేల మంది విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరవడం ఆందోళన కలిగించే అంశంగా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ అంశాన్ని ఎలా చక్కదిద్దాలో తెలియక ఉన్నత స్థాయిలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుశాతం పెంచడానికి కంటి తుడుపుగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని విద్యారంగ నిపుణులు కోరుతున్నారు. పాఠశాలలు విలీనం రద్దు చేయాలని, బ్రిటిష్ కాలం నుంచి ఉన్న ఎలిమెంటరీ, యూపీ, ఉన్నత పాఠశాల విధానాన్ని కొనసాగించాలి. విద్యార్థుల రోల్‌తో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి. బోధ నేతర పనులను పూర్తిగా నిలిపివేసి ఉపాధ్యాయులను తరగతి గదిలో బోధనకు పరిమితం చేయాలి.

గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేసి విద్యా విధానంలో సంస్కరణలు తీసుకొస్తే విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది మెరుగైన సమాజం రూపొందించే దిశగా తయారు చేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. లేదంటే బడి ఈడు పిల్లలు నిరక్షరాస్యులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని, కూటమి మేలైన విద్యా విధానం అమలు చేసే దిశగా ప్రయత్నాలు చేయాలని ఆశిస్తున్నారు.

రూ.290 కోట్లతో రహదారుల మరమ్మతులు

మంత్రి జనార్దన్‌రెడ్డి వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రూ.290 కోట్లతో రహదారుల మరమ్మతులకు చర్యలు చేపడుతున్నామని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ధ్వంసమైన 7071 కిలోమీటర్ల రహదారులకు సంబంధించిన 1393 రోడ్లపై గుంతల పూడ్చివేతకు రూ.290 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 'రాష్ట్ర రహదారుల నిర్వహణ, పునరావాసం-సవాళ్లు, ఉత్తమ పద్ధతులు' అంశంపై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు.

దీనికి రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ అధ్యక్షత నిర్వహించారు. మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా రహదారులను గుంతల రహిత రోడ్లుగా మార్చేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నట్లు తెలిపారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు రూ.186 కోట్లను రాష్ట్ర విపత్తు నివారణ నిధి నుంచి విడుదల చేశామన్నారు. కాంతిలాల్ దండే మాట్లాడుతూ... రహదారులు అధ్వాన స్థితికి చేరాయని, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రహదారుల మరమ్మతులకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం అసోం, గుజరాత్ రాష్ట్రాల్లో అధ్యయనం చేశామని వివరించారు. సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎస్ఐఆర్) సంచాలకులు ప్రొఫెసర్ మనోరంజన్ పారిడా ప్రసంగిస్తూ...రహదారుల నాణ్యతలకు సంబంధించిన పరిశోధనలపై వివరించారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ మనోజ్ కుమార్ అరోరా, రహదారుల, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నయిముల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో రాష్ట్రంలో రోడ్ల సమగ్రాభివృద్ధి, నిర్వహణకు అవసరమైన అనేక నిర్ణయాలపై చర్చించారు. స్టేట్ హైవేస్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, బిల్డర్స్ అసోసియేషన్ ఏపీ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, ఎస్ఆర్ఎం వర్సిటీ సివిల్ ఇంజినీర్లు రవితేజ, ప్రణవ్, భరత్, రోడ్లు, భవనాలశాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు రేపటితో గడువు ముగింపు

ఎమ్మెల్యేల జోక్యంపై చంద్రబాబు ఆరా
చివరి రెండు రోజుల్లో దరఖాస్తులు పెరిగే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రైవేట్ మద్యం దుకాణాలకు ఈనెల 9వ తేదీతో టెండర్ల గడువు ముగియనుంది. దీంతో చివరి రెండు రోజుల్లో దరఖాస్తులు పెరిగే అవకాశముందని ప్రొహిబిషన్-ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే దసరాకు ముందే ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరచుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటయిన ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించింది. వాటి స్థానంలో ప్రైవేట్ మద్యం దుకాణాలను ప్రవేశ పెడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 9 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టింది. 11వ తేదీన వచ్చిన దరఖాస్తులను వడబోతబోసి... 11న ఆయా జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో లాటరీల ద్వారా ఎంపిక చేస్తారు. 12వ తేదీన మద్యం దుకాణాలు తెరచేందుకు అవకాశం కల్పిస్తారు. లాటరీలో చేజిక్కించుకున్న మద్యం దుకాణాలకు రెండేళ్ల కాలపరిమితి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాలకు 9 వేల వరకు టెండర్లు దాఖలయ్యాయి. అందులో విజయనగరంలో అత్యధికంగా 855 టెండర్లు దాఖలు కాగా, అతి తక్కువగా మన్యం జిల్లాలో 174 టెండర్లు మాత్రమే వచ్చాయి. తిరుపతి జిల్లాలో 227 దుకాణాలకు కేవలం 165 టెండర్లు దాఖలయ్యాయి. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో కొన్ని షాపులకు టెండర్లు వేసేందుకే బిడ్డర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎన్టీఆర్, విజయనగరం జిల్లాల్లో ఒక్కో మద్యం దుకాణానికి సగటున 5 నుంచి 6 టెండర్లు, ఏలూరు జిల్లాలో 4 నుంచి 5 టెండర్లు దాఖలయినట్లు సమాచారం. మద్యం షాపుల నిర్వహణపై నిరంతరం నిఘా ఉంటుందని, పాఠశాలలు, దేవాలయాలు ఉన్న చోట్ల వంద మీటర్ల పరిధిలో ఎటువంటి మద్యం షాపులకు అనుమతి ఇవ్వలేదు. మద్యం షాపులు ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న అంశంపై నూతన మద్యం పాలసీలో నిబంధనలను పొందుపరిచినట్లు ప్రొహిబిషన్-ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. చివరి మూడు రోజులతో కలిపి 15 వేల వరకు టెండర్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. చాలా నియోజకవర్గాల్లో తాము ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టబోమని, తమకు వాటా మాత్రం కావాలని ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నట్లు తెలిసింది. అందుకు అంగీకరిస్తేనే దరఖాస్తు పెట్టుకోవాలని, లేకుంటే పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయని హెచ్చరిస్తున్నట్లు తెలిసింది. అధికార పార్టీ శాసనసభ్యులు, నాయకుల తీరుతో ప్రభుత్వానికి మద్యం దుకాణాల విషయంతో తలనొప్పి ఎదురైంది. గత ప్రభుత్వం మద్యం అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడిందని టీడీపీ నేతలు ఇప్పటి వరకు ఆరోపిస్తూ వస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ తాము అధికారంలోకి వస్తే కొత్త మద్యం పాలసీని తీసుకువస్తామని, తక్కువ ధరకు నాణ్యమైన మద్యం అందిస్తామని కూటమి హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట మేరకు కొత్త మద్యం పాలసీని చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చింది. అధికార నేతల మితిమీరిన జోక్యంతో మద్యం దరఖాస్తుల ప్రక్రియ వివాదాస్పదం కావడం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. మద్యం షాపుల లాటరీ వ్యవహారంలో ఎమ్మెల్యేల జోక్యంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. లాటరీ విషయంలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుంటారన్న సమాచారంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికారుల ద్వారా వారి వివరాలను సీఎం చంద్రబాబు ఆరా తీస్తున్నట్లు సమాచారం. మద్యం లాటరీ వ్యవహారంలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని సీఎం ఆదేశించినట్లు తెలిసింది.

శిక్షణ ఎవరి కోసం?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనన్న వాదనలున్నాయి. ఒక వైపు అదే ప్రైవేట్ విద్యా సంస్థ... ఇంటర్, ఐఐటీ, నీట్ శిక్షణకు మార్కులతో ప్రమేయం లేకుండా ప్రవేశాల్ని కల్పిస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మాత్రం ప్రతిభగల వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామంటున్నారు. ఇది కేవలం విద్యార్థుల ప్రయోజనాల కోసమే చేస్తున్నారా? లేక కార్పొరేట్ విద్యా సంస్థ కోసమేనా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

సంస్కరణలతో ఎవరికి మేలు ?

ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వం హడావుడిగా చేపట్టిన సంస్కరణలతో ఎవరికి మేలనేదీ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పేరొందిన కార్పొరేట్ విద్యా సంస్థలు ఐఐటీ, నీట్‌కు శిక్షణ ఇస్తున్నాయి. వాటన్నిటినీ పక్కనబెట్టి... కేవలం ఒకే కార్పొరేట్ విద్యా సంస్థకు అవకాశం కల్పించడం వెనుక ప్రయోజనాలపై తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లలో ఓ ప్రైవేట్ విద్యా సంస్థలతో శిక్షణ ఇప్పించడం వెనుక కారణాలు అంతుచిక్కడం లేదు. ఇది కేవలం ప్రభుత్వం విద్యార్థులపై ఉన్న మమకారమా?, లేక వారి ముసుగులో ప్రైవేట్ యాజమాన్యానికి ఆర్థికంగా సహకరించాలన్న వ్యూహం ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో... ఇదే తరహాగా మున్సిపల్ హైస్కూళ్ల విద్యార్థులకు ఐఐటీ, నీట్ శిక్షణ పేరుతో ఇదే ప్రైవేట్ విద్యా సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఆ పథకం పూర్తిగా విఫలమైంది. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మళ్లీ అదే విద్యా సంస్థకు ఈ విడత ఐఐటీ, నీట్ శిక్షణకు ద్వారాలు తెరవడంపై విద్యార్థి, యువజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఐఐటీ, నీట్‌తో ఫీజుల దోపిడీ

ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్ శిక్షణను అందిస్తూ పెద్దఎత్తున కార్పొరేట్/ ప్రైవేట్‌విద్యా సంస్థలు ఫీజులు దండుకుంటున్నాయి. విద్యార్థులను సెక్షన్లుగా విభజించి..ఒక్కో బ్యాచ్‌కు ఒక్కో రకంగా ఫీజులు నిర్ధారిస్తున్నాయి. ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్ శిక్షణకుగాను సగటున ఏడాదికి రూ.లక్ష రూపాయల నుంచి రూ.2లక్షల వరకు, హాస్టల్‌కు అదనంగా మరో లక్షా 50వేల నుంచి రూ.2లక్షలకు ప్రతేటా ఫీజులు వసూలు చేస్తున్నారు. దీని ఆధారంగా ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్‌ల శిక్షణతో హాస్టల్‌లో ఉండి చదివే విద్యార్థులకు ఏడాదికి సగటున రూ.2.50 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఖర్చవుతోంది. రెండేళ్లకు కలిపి రూ.5లక్షల నుంచి రూ.6లక్షలతో బయటపడాల్సి వస్తోంది. డే స్కాలర్స్‌కు ఏటా రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఫీజులను ముక్కుపిండీ మరీ వసూలు చేస్తున్నారు.

అదే కోవలోని ఓ కార్పొరేట్ సంస్థను ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో ఐఐటీ, నీట్ శిక్షణ కోర్సులకు ఎంపిక చేసింది. ఈ తరహాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ఐఐటీ, నీట్‌కు ఎంపిక చేసిన ఒక్కో విద్యార్థికి ఎంత ఫీజు నిర్ధారించారనేదీ ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది. ప్రైవేట్/కార్పొరేట్‌లో కొనసాగుతున్న తరహాగా... ఈ ప్యాకేజీలో ప్రభుత్వ విద్యార్థులకు బోధన ఉంటుందా?, అదే తరహాగా ఫ్యాకల్టీలు ఉంటారా? అనేది నిశితంగా పరిశీలించాలి.

వైద్యశాస్త్రంలో ఇద్దరికి నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

విభాగాల్లో విజేతలను ప్రకటిస్తారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి, అక్టోబరు 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లు వెల్లడిస్తారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్తగా పేరు గడించిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీద ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు ఈ అవార్డు ప్రదానం చేస్తున్నారు. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా... 1901 నుంచి ఆయన ట్రస్టు ద్వారా ఈ అవార్డులను ఏటా అందజేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు 11 లక్షల స్వీడిష్ క్రోనర్(10 లక్షల డాలర్లు) నగదు అందుతుంది. వీటిని డిసెంబరు 10న అవార్డు గ్రహీతలకు ప్రదానం చేస్తారు.

ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై వేటు

(మొదటిపేజీ తరువాయి)

తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై చేసిన అభియోగాలపై 15రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపైన, అప్పటి సీఎం జగన్‌పైన వ్యక్తిగత దూషణలు చేశారు. దానిపై సీఐడీ కేసు నమోదు చేసింది. హైదరాబాద్‌లో ఉన్న రఘురామకృష్ణరాజును ఏపీకి తరలించి దర్యాప్తు చేశారు. ఆ సమయంలో తనను విచారణ పేరుతో సునీల్‌కుమార్ వేధింపులకు పాల్పడ్డారని రఘురామ అభియోగాలు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక... గత ప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగారన్న ఆరోపణలపై చాలా మంది ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఇప్పటికే సునీల్ కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసి...వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచిన విషయం విదితమే.

లాలు, తేజస్వికి ఊరట

(మొదటిపేజీ తరువాయి)

విడిచివెళ్లవద్దని సూచించింది. ఈ విషయంపై తేజస్వీ యాదవ్ స్పందిస్తూ కొంతమంది తమపై కుట్రలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని పరోక్షంగా బీజేపీపై మండి పడ్డారు. ఈ కేసులో తమ ప్రమేయం లేదన్నారు.

ఆర్‌జీ కర్ హత్యాచారం కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని కోల్‌కతాలోని ఒక ప్రత్యేక కోర్టు ముందు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సీబీఐ పేర్కొన్నట్లు వారు వివరించారు. కాగా సామూహిక అత్యాచార ప్రస్తావన ఏదీ ఛార్జ్‌షీట్‌లో పేర్కొనలేదని, సంజయ్ రాయ్ ఒక్కడే ఈ నేరానికి పాల్పడినట్లు ఇది సూచిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సీబీఐ విచారణను కొనసాగిస్తోంది.

యుద్ధం ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశ దీర్ఘకాల పలస్తీనా అనుకూల విధానానికి తూట్లు పొడిచిందని విమర్శించారు. ఇజ్రాయిల్‌కు మన దేశం డ్రోన్‌లు సరఫరా చేస్తోందన్నారు. అమెరికా మిత్రదేశాలు, నాటో సభ్యులైన స్పెయిన్, బెల్జియం, బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా చేయవద్దని నిర్ణయిస్తే... భారతదేశం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు.

144 మంది డబ్బులిచ్చారు

(మొదటిపేజీ తరువాయి)

సహకారంతోనే పేపర్ బయటకు వచ్చినట్లు చార్జిషీట్‌లో పేర్కొంది. నీట్ పరీక్ష జరిగిన రోజు (మే 5న) ఉదయం 8 గంటలకు ప్రశ్నాపత్రాలు పాఠశాలకు చేరుకున్నాయి. ఆ సమయంలో పరీక్షా కేంద్రానికి కోఆర్డినేటర్‌గా ఉన్న హసనుల్ హక్.. ఐఐటీ జెంషడ్‌పూర్‌కు చెందిన ఓ సివిల్ ఇంజినీర్‌ను ప్రశ్నాపత్రం బాక్సు ఉన్న గదిలోకి పంపించాడు. ప్రత్యేక టూల్‌కిట్ సాయంతో ఆ పెట్టెను తెరిచాడు. ప్రశ్నాపత్రం మొత్తాన్ని ఫొటో తీసుకున్నాడు. అనంతరం దాన్ని యథావిధిగా పెట్టెలో పెట్టి మళ్లీ సీల్ చేశాడు. బయటకు వచ్చిన తర్వాత ఆ ప్రశ్నాపత్రాన్ని ఓ అతిథి గృహంలో ఉన్న మరో వ్యక్తికి పంపించాడు. అక్కడున్న తొమ్మిది మంది వైద్య విద్యార్థులు ప్రశ్నాపత్రానికి సమాధానాలు పూర్తిచేశారు. వాటిని వివిధ ప్రాంతాల్లో ఉన్న ముఠా సభ్యులకు పంపించారు. అనంతరం డబ్బులు చెల్లించిన అభ్యర్థులకు వాటిని చేరవేసినట్లు సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది. ఈ పేపర్ లీకేజీ వ్యవహారం గురించి 298 మంది సాక్షులు, 290 డాక్యుమెంట్లు, 45 మార్గాల్లో లభించిన సమాచారం ఆధారంగా 5500 పేజీల చార్జ్‌షీట్‌ను సీబీఐ రూపొందించింది.

ఇజ్రాయిల్‌ను ప్రపంచ దేశాలు నియంత్రించాలి

పశ్చిమాసియాలో శాంతిస్థాపన జరగాలి
వామపక్ష నేతల ఉద్ఘాటన

విశాలాంధ్ర-విజయవాడ: పలస్తీనాపై విచక్షణా రహిత దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయిల్‌ను ప్రపంచ దేశాలు నియంత్రించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవీంద్రనాథ్ అభిప్రాయపడ్డారు. సోమవారం విజయవాడ బాలోత్సవ్ భవనంలో 10 వామపక్షాల అధ్వర్యాన పలస్తీనపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దమనకాండను వ్యతిరేకిస్తూ ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. సీపీఎం ఎన్టీఆర్ జిల్లా నాయకులు దోనేపుడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రవీంద్రనాథ్ మాట్లాడుతూ యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికా చర్యలను ప్రపంచ దేశాలన్నీ నిరసించాలన్నారు. సంవత్సరకాలంగా ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమానికి పసిపిల్లలు, మహిళలు సహ అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని...దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సామ్రాజ్యవాద, యుద్ధోన్మాద దేశాలు ఏడాది కాలంగా దాడులు చేస్తున్నప్పటికీ గాజా ప్రజలు అడ్డుకుంటూనే ఉన్నారని, అటువంటి వారికి ప్రపంచం యావత్తు సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. సోవియట్ యూనియన్ ఉన్నంతకాలం అరబ్ దేశాల్లో సామ్రాజ్యవాద దేశాల ఆటలు సాగలేదని.. ఆ తర్వాతే రెచ్చిపోతున్నాయని తెలిపారు. అమెరికా మద్దతు ఇచ్చే యుద్ధోన్మాదులు మాత్రమే ఇజ్రాయిల్ దురాగతాలను స్వాగతిస్తున్నారని... ప్రపంచ శాంతి కోసం పశ్చిమాసియాలో యుద్ధాన్ని నిలుపుదల చేసేలా ఐక్యరాజ్య సమితి చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు చేశాక... ఇజ్రాయిల్ ఉత్తర మధ్యప్రాంత వాసులు ఎప్పుడు ఎటునుంచి ప్రమాదం ముంచుకుస్తుందోనని భయభ్రాంతు లకు గురవుతున్నారని చెప్పారు. పలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకొని అంతర్యుద్ధాన్ని ప్రోత్సహించిందన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ తాజాగా లెబనాన్‌పై జరిపిన దాడులో వెయ్యి మందికి పైగా చనిపోయారని చెప్పారు. తమ ప్రాణాలు కాపాడుకోవడం కోసం లక్షల మంది ఇళ్లు వదిలి వెళ్లిపోయారన్నారు. సెప్టెంబరు 27న జరిపిన వైమానిక దాడుల్లో హిజ్బుల్లా అధినేత నస్రల్లాను ఇజ్రాయిల్ హతమార్చిందన్నారు. పలస్తీనాకు ఎవరు మద్దతు పలికినా వారిని వెంబడించి చంపటమే లక్ష్యంగా పెట్టుకొందని మండిపడ్డారు. ఒక జాతిని అంతం చేయాలనే ఉద్దేశంతో పలస్తీనాపై దాడిచేసి వేలమందిని పొట్టనబెట్టుకున్న ఇజ్రాయిల్‌ది సామ్రాజ్యవాద దురహంకారం అన్నారు. ప్రపంచ చరిత్రలో సామ్రాజ్యవాద యుద్ధాలు ఇప్పటి వరకు విజయం సాధించలేదని తెలిపారు. వామపక్ష పార్టీల నాయకులు జాస్తి కిషోర్, కె.సుధీర్, బాషా, రవి, కొల్లా రాజమోహన్, సలీమ్, రవికాంత్ తదితరులు ప్రసంగించారు. తొలుత సీపీఐ విజయవాడ నగర నాయకులు మూలి సాంబశివరావు స్వాగతం పలికారు. ప్రజానాట్యమండలి నాయకులు సామ్రాజ్యవాద వ్యతిరేక గీతాలు ఆలపించారు. తొలుత ఇజ్రాయిల్ దాడుల్లో మృతిచెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న టి.మహేశ్ నాయుడు

టమాటా, ఉల్లి ధరలకు కళ్లెం: మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో టమాటా, ఉల్లి ధరల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారు లను ఆదేశించారు. వీటి ధరల పెరుగుదల అంశంపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉద్యాన శాఖ కార్యదర్శి అహ్మద్ బాబు, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, సంబంధిత అధికారులతో సోమవారం సచివాలయంలో మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ అధ్వర్యంలో రైతుల నుంచి నేరుగా టమాట, ఉల్లి సేకరించి రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు 1.35 లక్షల కేజీల టమాటా, 21 వేల కిలోల ఉల్లి రైతుల నుంచి సేకరించి రైతు బజార్లకు సరఫరా చేస్తున్నామని అధికా రులు మంత్రికి వివరించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సాధారణ ధరలకు టమాట, ఉల్లి విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

5,050 మంది ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా డీఎస్సీ-2024కు 5,050 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణ సంస్థలలోను, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిళ్లలో దీనిని నిర్వహిస్తారు. ఉపాధి కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణా సంస్థలు కనీసం రెండు డీఎస్సీ నియమాకాలకు శిక్షణ ఇచ్చిన సామర్థ్యం ఉండాలి. గత డీఎస్సీ నియామకాల్లో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొంది ఉండాలి. 3 సంవత్సరాల టర్నోవర్ కనీసం రూ.40 లక్షలుగా ఉండాలి. ఆసక్తిగల ఇనిస్టిట్యూట్ల నిర్వాహకులు ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ నుంచి డాక్యుమెంట్లను ఈనెల 7వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను 21లోగా పంపాలి. ఇప్పటికే ఏపీ టెట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. డిసెంబరులో డీఎస్సీ ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఈ డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకుగాను ఆసక్తిగల ఇనిస్టిట్యూట్ల నుంచి దరఖాస్తులను కోరుతోంది. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి శిక్షణ కోసం దరఖాస్తులకు ప్రత్యేకంగా ప్రకటన వెలువడుతుంది.

దసరా ఉత్సవాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడ కనకదుర్గ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలకు దేవాలయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో కీలకమైన చివరి నాలుగు రోజుల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా చూసేందుకు, అన్ని విభాగాలను సమన్వయ పరచుకునేందుకుగాను ఈ నియామకం చేపట్టారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా కనకదుర్గ అమ్మవారికి ప్రీతిపాత్రమైన మూలానక్షత్రం రోజైన అక్టోబర్ 9వ తేదీన తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చే భక్తులకు అమ్మవారి దర్శనం సులభంగా కలిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ అధికారులు ఉత్సవాల నిర్వహణలో భక్తుల మనోభావా లకు అనుగుణంగా ఏర్పాట్లు చేసి... భక్తులకు అమ్మవారి దర్శనం నభూతోన భవిష్యత్ అనిపించేట్లుగా ఉండాలని మంత్రి ఆనం పేర్కొన్నారు.

2025 నాటికి రూ.8 వేల కోట్ల డిపాజిట్ల సేకరణ

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మానం ఆంజనేయులు

విశాలాంధ్ర- బాపట్ల: సహకార వ్యవస్థ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలనే లక్ష్యంతో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకును స్థాపించినట్లు మాజీ ఎమ్మెల్యే, బ్యాంకు మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు చెప్పారు. సోమవారం బాపట్లలో బ్యాంకు 54వ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అధ్యక్షత వహించారు. మానం ఆంజనేయులు మాట్లాడుతూ 2025 మార్చి నాటికి తమ బ్యాంక్ రూ.8 వేల కోట్ల డిపాజిట్ల సేకరణను లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రభుత్వాల నుండి సహాయ, సహకారాలు అడిగితే సహకార వ్యవస్థ చచ్చిపోతుందని స్పష్టం చేశారు. అలా చేయడానికి ప్రభుత్వాలు చాలా ప్రయత్నాలు చేశాయన్నారు. పాలకవర్గాల అసమర్ధ వల్లే ఎక్కువ బ్యాంకులు మునిగిపోతున్నాయని చెప్పారు. పాలకవర్గం, ఉద్యోగులు, సభ్యులు కలిసి ఉంటేనే సహకార వ్యవస్థ బలోపేతంగా ఉంటుందన్నారు. బాపట్ల బ్రాంచ్‌ను రక్షించుకునే బాధ్యత స్థానిక డిపాజిట్‌దారులదేనన్నారు. బాపట్ల బ్రాంచ్‌లో డిపాజిట్లు వచ్చినా... రాకపోయినా 100 కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడం ఖాయమన్నారు. అత్యధిక కుటుంబాలకు రుణాలు ఇచ్చి... వారిని ఆర్థికంగా నిలబెడితే బ్యాంకుకు సార్థకత వస్తుందన్నారు. చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ కో-ఆపరేటివ్ బ్యాంకులు ప్రజల విశ్వాసంపై కొనసాగుతున్నాయన్నారు. దక్షిణ భారతదేశంలోనే మన బ్యాంక్ అతిపెద్ద బ్యాంక్‌గా రూపాంతరం చెందిందని కొనియాడారు. బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తొలుత బ్రాంచ్‌ను ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా ది వాణి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, ఫెడరేషన్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ టీఏఎఫ్ సీయూబీ సభ్యులు యం.వెంకటరత్నం, ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ, హైదరాబాద్ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రంగరాజు, జనరల్ మేనేజర్ (రిటైర్డ్) ఆర్‌బీఐ బొడ్డుపల్లి దుర్గాప్రసాదరావు, జిల్లా సహకార అధికారి (డీసీఓ) బాపట్ల సీహెచ్ శ్యాంసన్, గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ది ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ గుంటూరు చైర్మన్ ఏలూరు గురవయ్య, ది గుంటూరు మహిళా అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ వాణి సుజాత, ది బాపట్ల కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ గర్నెపూడి వెంకటేశ్వరరావు, ది రేపల్లె కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, రేపల్లె పాలకవర్గం చైర్మన్ గోగినేని సుబ్బారావు, వైస్ చైర్మన్ ఎం.రాఘవరావు, డైరెక్టర్లు అప్పారి జోసెఫ్ స్టాలిన్, నామాన కామరాజు, గుళ్లపల్లి జనార్ధనరావు, చెరువు ఆదినారాయణ శాస్త్రి, పొట్లూరి వెంకటరమణ, కంద ప్రసాదరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, చిన్నం కోటేశ్వరావు, పాల్యం నారాయణస్వామి, ఆచల్ల రామకృష్ణారావు, బ్యాంక్ డిప్యూటీ సీఈఓ వీవీబీ వరలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్ ఎ.అర్జున్ పాల్గొన్నారు.

దసరాకు డీఏ, ఐఆర్ ప్రకటించండి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 10న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులకు దసరా సందర్భంగా శుభవార్త చెప్పాలని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం.అప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఏ, ఐఆర్ ప్రకటిస్తారని, పీఆర్సీ కమిషన్ వేస్తారని ప్రభుత్వ ఉద్యోగులందరూ ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించాలని, దసరా సందర్భంగా వారికి సంతోషకరమైన వార్త తెలపాలని కోరారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోండి

దళారులను అరికట్టి మద్దతు ధర కల్పించండి: సీపీఐ

విశాలాంధ్ర-నంద్యాల: మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని, క్వింటాకు రూ.మూడు వేలు గిట్టుబాటు ధర కల్పించాలని, మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో నంద్యాలలో కలెక్టర్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. అనంతరం రైతులతో కలిసి సంఘ నేతలు కలెక్టర్ రాజకుమారి గనియాకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామన్నారు. అకాల వర్షాలకు తడిచిన మొక్కజొన్నను... దళారీలను అరికట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అన్నారు. వెలుగోడు మండలంలో మొక్కజొన్న పంటకు కాపలాదారుగా ఉంటూ మృతిచెందిన యువ రైతు శివగంగాధర్ రావు కుటుంబానికి రూ.50 లక్షలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. జిల్లాలో 20 వేల హెక్టార్లలో మొక్క జొన్న పంట వేశారని, గత రెండు రోజులుగా మొక్కజొన్న పండించిన ప్రాంతాలను పరిశీలించి రైతులతో చర్చించినట్టు పేర్కొన్నారు. అకాల వర్షాల వల్ల పంట చేతికిరాక అధికశాతం మంది రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో దళారులు రైతులను మోసగించేలా క్వింటా రూ.2,300 కొంటున్నారని, గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత నూనెపల్లె ఓవర్ బ్రిడ్జి నుంచి వందల మంది రైతులతో కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చాంబర్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, నాగరాముడు, భాస్కర్, మోటారాముడు, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు భార్గవ్, హరినాథ్, జి. రమేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు నరసింహులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పండుగ వేళ పస్తులే!

భారీగా పెరిగిన నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు: చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: దసరా పర్వదినం వేళ కూడా సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు పస్తులు తప్పేలా లేవు. మార్కెట్‌లో కొన్ని రోజులుగా నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు అకాశాన్ని అంటుతున్నాయి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఇష్టానుసారం ధరలు పెంచేశారు. దీంతో ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. పండుగ సందర్భంగా కంది పప్పు, బియ్యం, నూనెలు, కొబ్బరి, ఉల్లి, వెల్లుల్లి, టమాటా ధరలు పెంచేశారు. ఇప్పటికే బియ్యం ధరలు కిలో రూ.58 నుంచి రూ.70కి పెరిగాయి. కంది పప్పు కిలో రూ.170 నుంచి రూ.180, వంట నూనెపై కిలోకు రూ.5 నుంచి 10 రూపాయల వరకు పెరిగింది. ఎండు కొబ్బరిపై రూ.150 నుంచి 170, వెల్లుల్లి కిలో రూ.400, కొబ్బరి కాయలు రూ.20 నుంచి రూ.30 కి పెంచేశారు. ఇక కూరల్లో టమాటా వాడలేని పరిస్థితి వచ్చింది. సోమవారం రైతు బజారులో కిలో టమాటా రూ.54 ఉండగా, రెండు రోజు క్రితం వరకు బహిరంగ మార్కెట్‌లో రూ.80 వరకు అమ్మారు. అల్లం రూ.74, బీన్స్ రూ.80 ఇలా ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తెలుగు రాష్ట్రాలలో దసరా పండుగను ప్రతి ఒక్కరూ సందడిగా నిర్వహించుకుంటారు. ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలు అమాంతం పెంచేశారు. మరో వైపు కూలి పనులు చేసుకునే వారు పండుగ చేసుకోవాలంటే అప్పులు చేయక తప్పడం లేదు. అయితే ధరలను అదుపు చేయవలసిన అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు కల్తీల బెడద ఎక్కువైంది. ప్రభుత్వం సామాన్యులకు ఇచ్చే రేషన్ ద్వారా బియ్యం, చక్కెర, జొన్నలు మాత్రమే పంపిణీ చేయడం పేదలకు అవి ఏమాత్రం సరిపోవడం లేదు. నూనె, కందిపప్పు కూడా ఇస్తే కనీసం కొంతైనా న్యాయం చేసినట్లు ఉంటుంది. మార్కెట్‌లో ఉల్లిపాయలు కిలో రూ.35 నుంచి రూ.45 వరకు విక్రయిస్తున్నారు. అదే మార్కెట్‌లో ఉల్లికి మాత్రం గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దళారులు క్వింటా ఉల్లి రైతుల నుంచి కనిష్ఠంగా రూ.2 వేలు, గరిష్ఠంగా రూ.3,200 కొనుగోలు చేస్తున్నారు. కానీ మార్కెట్‌లో మాత్రం అధిక ధరలకు విక్రయాలు చేస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పాలకులు ధరలను అదుపు చేస్తామని చెబుతున్నా ఎక్కడా చర్యలు కానరావడం లేదు. వ్యాపారులు, దళారులు కుమ్మక్కై రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి, సరుకును దాచి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే ధరలను అదుపు చేయడంపై దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న 131 మందికిపైగా ఉన్న వరద బాధితులకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, వైస్ చైర్మన్ మునిరత్నం ఆర్టీసీ హౌస్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్లకు అవుట్ సోర్సింగ్ ఉపాధ్యక్షుడు తంగుడు ముత్యాలరావు, ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్... ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఎనిమిదివేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. ఆప్కాస్‌లో చేర్పించేలా చూడాలని కోరారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ల ద్వారా చెల్లిస్తున్న వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఆర్టీసీ యాజమాన్యం నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లించేలా చూడాలని కోరారు. దీనిపై కొనకళ్ల మాట్లాడుతూ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు సంస్థ పరంగా ఎంతవరకు సహాయపడగలమో ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు బ్రహ్మానందరెడ్డి, రవి వర్మ, చంద్రశేఖర్, యూనియన్ రాష్ట్ర జోన్, అవుట్ సోర్సింగ్ నాయకులు తంగుడు గంగాంజనేయులు, విజయ్, హరిప్రసాద్, దాసరి కిరణ్‌కుమార్, నవీన్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్‌కు ఈయూ సత్కారం

ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నాన్ని విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో సోమవారం ఎంప్లాయీస్ యూనియన్ ఘనంగా సత్కరించింది. బాధ్యతల స్వీకరణ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య తదితరులు కలిసి అభినందించారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, కోశాధికారి ఎండీఏ సిద్దిక్, ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నందమూరి రామారావు, సహాయ కార్యదర్శులు నారాయణ, మొహిద్దీన్, విజయవాడ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, చిత్తూరుజిల్లా ఈయూ కార్యదర్శి బలరామ్, అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల 'బెనిఫిట్స్' చెల్లించాలి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, పోలీసు సరెండర్ లీవుల బిల్లులు దసరాకు చెల్లించాలని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవిన్యూ భవన్‌లో వారు జిల్లా అద్యక్షులు గిరికుమార్‌రెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు చాలా ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఠంచనుగా ఒకటవ తేదీ జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు ఇస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ఉద్యోగులుగా అర్థం చేసుకోగలమని... కరోనా, వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా ఉద్యోగులు పెద్దఎత్తున ఆర్థిక సహాయం అ ందచేయడం జరిగిందన్నారు.

టెట్ ఎస్జీటీకి 85 శాతం హాజరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్షలలో భాగంగా సోమవారం ఎస్జీటీ విభాగం టెట్ పరీక్షలు జరిగాయి. 32,875 మందికిగాను 28,267 మంది అభ్యర్థులు (85.98 శాతం) హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 69 సెంటర్లలో జరిగిన ఎస్జీటీ ఉపాధ్యాయుల అర్హత పరీక్షకు 16,525 మందికిగాను 14,042 మంది (84.97 శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్-2 విభాగంలో 68 సెంటర్లలో 16,350 మందికిగాను 14,231 మంది (87.04 శాతం) హాజరయ్యారు.ఇంగ్లీష్, హిందీ స్కూల్ అసిస్టెంట్ భాషోపాధ్యాయుల సౌలభ్యం కోసం ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను https://aptet.apcfss.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వాటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే... ఈనెల 9వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా తెలియజేయాలని ఏపీ టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు.

జీవుల్ని రక్షిస్తేనే మానవ మనుగడ

వన్యప్రాణి వారోత్సవాల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వసుధైక కుటుంబంలో సమస్త జీవ కోటికి చోటు ఉందని, వాటిని రక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మనపై ఆధారపడిన, మనతోపాటు జీవనం సాగించే ఇతర జీవ రాశులన్నింటినీ రక్షించుకుంటేనే మనిషి సాగిస్తున్న ఈ దశ స్వచ్ఛంగా సాగిపోతుందని, వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయన్నారు. వన్య ప్రాణులు, సముద్ర జీవులు, ఇతర జీవరాశి పూర్తి మనుగడలో ఉండి, ప్రకృతిని కాపాడితేనే మనిషికి స్వచ్ఛమైన గాలి, నీరు అందుతుందన్నారు. ఇతర జీవుల మనుగడ మీద మన ఉనికి ఆధారపడి ఉందనే విషయం గమనంలోని తీసుకోవాలని, పర్యావరణం, వన్య ప్రాణుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని సాధ్యమని స్పష్టం చేశారు. మంగళగిరిలోని అరణ్య భవన్ లో సోమవారం నిర్వహించిన 70వ వన్య ప్రాణి వారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్ హాజరై ప్రసంగించారు. భవిష్యత్తు తరాలకు బంగారం లాంటి పర్యావరణాన్ని అందించాలంటే చిన్నప్పటి నుంచే వారికి ప్రక ృతి ప్రాధాన్యం, పర్యావరణ అవసరాలను తెలియ చెప్పాలి. పర్యావరణ మూలధనం చెట్లు. వాటిని రక్షించుకొని భావి తరాలకు అద్భుతమైన పర్యావరణం, పచ్చదనం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పర్యావరణాన్ని కాపాడాలంటే మన వంతుగా రోజువారీ వాడుతున్న ప్లాస్టిక్‌కు క్రమంగా తగ్గించాలి. మొక్కల పెంపకం అనేది మన జీవన విధానంలో భాగం కావాలి. పిల్లలు చెప్పిన విషయాలు నన్ను కదిలిస్తాయి. కల్మషం లేకుండా మనసులో ఏముంటే అది వారు చెబుతారు. వారి సూచనలు నేను అందుకే వింటాను. ఇక్కడకు వచ్చిన విద్యార్థుల స్ఫూర్తి నాకు కొత్త ఉత్సాహం అందించింది. నా చిన్నపుడు ఎక్కడైనా పంపులో నీరు సులభంగా తాగే వాళ్లం. ఇప్పుడు ఏం తాగాలన్నా భయంగా ఉంది. నా చిన్నపుడు భవిష్యత్తులో నీరు, గాలి కొనుక్కోవాలని అని చెబితే నవ్వుకునేవాళ్లం. ఇప్పుడు అదే పరిస్థితి వచ్చింది. దీనికి మనమే కారణం. భావి తరాలకు ఎలాంటి ప్రకృతిని బహుమతిగా అందిస్తామనేది మన చేతిలో ఉంది. దానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. పిల్లలు దగ్గర నుంచి పెద్దల వరకు పర్యావరణ హితం కోసం ఆలోచించి ప్రతి పని చేయాలి. పర్యావరణాన్ని రక్షించడం అనేది రోజువారీ జీవన విధానంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ చిరంజీవి చౌదరి, సీనియర్ అధికారులు ఎ.కె.నాయక్, ఆర్ పి ఖజురియా, డా.శ్రీధర్, రేవతి, రాహుల్ పాండే, శాంతి ప్రియ పాండే తదితరులు పాల్గొన్నారు.పర్యావరణ, వన్య ప్రాణి సంరక్షణతోనే జీవకోటి మనుగడ సాధ్యమనే విషయాన్ని తెలియజేస్తూ అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. వన్యప్రాణుల విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఉపముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

E PROCUREMENT SHORT TENDER NOTICE

(1) NIT No. 04/MAU61-ADMN0IS(INSS)/8/2024-IS, Dt. 06/10/2024
Name of Work: APCRDA- "Supply & Installation of CCTV cameras @APCRDA Unit office in capital city,Amaravati". **ECV: Rs. 9,52,573/-**. The bid can be downloaded on AP e-procurement portal from **08.10.2024 to 16.10.2024 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **16.10.2024 up to 15.00 Hrs**, Technical bid opening **16.10.2024 @ 16.00 Hrs.**

(2) NIT No. 05/MAU61-ADMN0IS(INPN)/12/2024 Dt. 04/10/2024
Name of Work: APCRDA-" Providing Networking Services & CCTV Cameras Services for Newly Recruited staff at CRDA office, Eluru Road, Vijayawada". **ECV: Rs. 7,37,519/-.** The bid can be downloaded on AP e-procurement portal from **08.10.2024 to 14.10.2024 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **14.10.2024 up to 15.00 Hrs**, Technical bid opening **14.10.2024 @ 16.00 Hrs.**

For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**
Sd/- Commissioner, APCRDA, Vijayawada

సంపాదకీయం

శిక్షకన్నా ఘోరమైన విచారణ తంతు

ఈ దేశంలో నేర విచారణ ప్రక్రియే కొన్ని సందర్భాలలో శిక్ష కన్నా ఘోరమైంది. 2020 నాటి ఈశాన్య దిల్లీ అల్లర్ల కేసులో 2020 సెప్టెంబర్ 14 న అరెస్టయిన ఉమర్ ఖాలిద్ 49 నెలల నుంచి లేదా నాలుగేళ్ల ఒక నెల పై నుంచి విచారణ కూడా లేకుండా జైలులో మగ్గిపోతూనే ఉన్నాడు. న్యాయం నత్త నడక, ఎక్కే మెట్లు దిగే మెట్లు, కోర్టుల చుట్టూ తిరిగి చెప్పులు అరిగిపోవడం, న్యాయం చాలా ఖరీదైన వ్యవహారం లాంటి పడికట్టు మాటలేవీ ఉమర్ ఖాలిద్ విషయంలో చాలా కురచనైనవే. ఉమర్ ఖాలిద్‌ను చిన్నా చితక ఆరోపణలతో అరెస్టు చేయలేదు. దిల్లీ అల్లర్ల వ్యవహారంలో ఆయనే కీలక కుట్రదారు అన్న ఆరోపణ మోపారు. ఎందుకైనా మంచిదని భారత శిక్షాస్మృతిలోని అనేక సెక్షన్లతో పాటు, భయంకరమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలోని అనేక సెక్షన్లు, దేశ ద్రోహం ఆరోపణ, హత్య, హత్యా యత్నంలాంటి అనేక ఆరోపణలు ఉమర్ ఖాలిద్ ఎదుర్కుంటున్నాడు. ఆయన మీద మోపిన ఆరోపణల చిట్టా చూస్తే ఆయన ఎంత భయంకరుడో, ఆయనవల్ల దేశానికి ఎంత పెద్ద ప్రమాదం పొంచి ఉందోనన్న భీతి దేశవాసులకు కలగక మానదు. ఇంత తీవ్రమైన ఆరోపణలు ఉన్న కేసులో కూడా విచారణ జరగదు. వాయిదాల మీద వాయిదాలు పడుతూ ఉంటుంది. ఒకసారి న్యాయమూర్తులకు తీరిక ఉండదు. మరోసారి ఏదో ఒక పక్షం న్యాయవాదులకు వెసులుబాటు ఉండక పోవచ్చు. ఇంకోసారి ఈ కేసును విచారిస్తున్న న్యాయమూర్తి విచారణ బాధ్యతల నుంచి తప్పుకోవచ్చు. తాజాగా ఉమర్ ఖాలిద్ కేసును న్యాయమూర్తులు నవీన్ చావ్లా, షలిందర్ కౌర్ సోమవారం విచారించవలసింది. కానీ ఈ కేసును అసలు న్యాయమూర్తుల బెంచి ముందుకే తీసుకురాలేదు. ఇది ఉమర్ ఖాలిద్ చేసిన ఘోరాల జాబితాలోకి రాక పోయినా శిక్ష, క్షోభ అనుభవించాల్సింది మాత్రం ఆయనే. ఈ దేశంలో విచారణలో ఉన్న ఖైదీలు అరిటాకులాంటి వారు. ఎప్పుడు ఏ ముల్లు వచ్చి పడుతుందో తెలియదు. నిరంతర ఎదురుచూపులతోనే జైలు నాలుగు గోడల మధ్య బతుకు వెళ్ల దీయాల్సిందే. జైలు జీవితం ఎప్పుడు తెల్లారుతుందో ఖైదీకి తెలియదు. అంతా గాఢాంధకారమే. సోమవారం ఖాలిద్ కేసు న్యాయమూర్తుల ముందుకు రాలేదు కనక కోర్ట్ మాస్టర్ చేసేదేమీ లేక నవంబర్ 25 నాటికి వాయిదా వేశారు. మళ్లీ ఎదురుచూపు తప్పదు.

న్యాయమూర్తుల ముందుకు కేసు రాకపోయినా, లేదా ఏ న్యాయమూర్తో కేసు విచారణ నుంచి తప్పుకున్నా, న్యాయవాదికి వెసులుబాటు లేకపోయినా ఖైదీ పడాల్సిన బాధలో ఏ మార్పూ ఉండదు. కాలెండర్‌లో తిరిగే తేదీలను, పేజీలను చూస్తూ దారి తెన్ను కనిపించని రీతిలో నాలుగుగోడల మధ్య కాలక్షేపం చేయాల్సిందే. ఉమర్ ఖాలిద్ జైలులో నిరవధికంగా కొనసాగడంవల్ల నష్టం ఆయనొక్కడికే కాదు. ఆయన లాంటి ఆలోచనాపరులు స్వేచ్ఛగాఉండే అవకాశం ఉంటే ఈ సమాజానికే ప్రయోజనం. కాని దేశ ప్రయోజనం గురించి "మోదీ భక్త జనులు" తప్ప ఎవరు ఆలోచిస్తారు? అయితే మోదీ భక్తులకు ఉమర్ ఖాలిద్ లాంటి వారిని ఎంత కాలం జైలులో ఉంచగలిగితే అంత పైశాచిక ఆనందం అనుభవించే అవకాశం ఉంటుంది. నిరంతర జాప్యానికి, సుదీర్ఘ విచారణా ప్రక్రియకు కారణం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం న్యాయమూర్తులూ చేయరు. న్యాయస్థానాలూ చేయవు. కానీ అత్యున్నత న్యాయస్థానం పీఠాలపై ఆసీనులైన వారు బెయిలు హక్కు, తప్పకపోతేనే జైలు అన్న సూక్తి పదే పదే గుర్తు చేస్తుంటారు. దాని అమలును మాత్రం పట్టించుకోరు. తాము ఇచ్చిన ఆనతే ఎందుకు అమలు కావడం లేదో ఆలోచించరు.

న్యాయమూర్తులు ఇలాంటి కీలక విషయాలను పట్టించుకోనందువల్ల ఖైదీలు జైలులోనే ఉండిపోవలసి వస్తుంది. అందుకే మన జైళ్లలో నేరస్థుల సంఖ్యకన్నా విచారణలో ఉన్న ఖైదీల సంఖ్యే ఎక్కువ. అయినా ఎవరికీ పట్టదు. ఈ కేసులో జాప్యానికి పోలీసుల బాధ్యతా తక్కువేమీ కాదు. ఎప్పుడో కేసు న్యాయమూర్తుల ముందుకు విచారణకువస్తే మేం దాఖలు చేసిన చార్జిషీట్లు వేల పేజీలు ఉన్నాయి కనక వాటి సారమేమిటో వివరించడానికి మరింత సమయం కావాలని అమాయకంగా అభ్యర్థిస్తారు. పెద్ద మనసు చేసుకుని న్యాయమూర్తులు మరింత గడువు ఇస్తారు. ఆ గడువు దాటిపోయి మరో విచారణ తేదీ వచ్చినా పోలీసులు ఇదే వాదన ముందుకు తెస్తారు. అదేమిటి అని న్యాయమూర్తులు నిలదీయరు. అలవోకగా వాయిదా వేసేస్తారు. ఖాలిద్ బెయిలు పిటిషన్ మీద పోలీసుల వైఖరి ఏమిటో చెప్పాలని న్యాయమూర్తులు సురేశ్ కుమార్ కైత్, గిరీశ్ కథ్పాలియా జులై 24 పోలీసులను ప్రశ్నించారు. కానీ తదుపరి విచారణ జరిగిన రోజున కూడా పోలీసులు తమ వాదన సిద్ధం చేసుకోలేదు. కేసు గత 29వ తేదీన విచారణ జరపాల్సింది. జరగలేదు. సోమవారం జరగాల్సింది. అసలు న్యాయపీఠమే ఏర్పాటు చేయలేదు కనక మళ్లీ నవంబరు 25 కు వాయిదా పడింది. ఉమర్ ఖాలిద్ నాలుగేళ్ల నుంచి అలవాటైన రీతిలో జైలులోని తన కలుగులోకు వెళ్లిపోయారు. సుప్రీంకోర్టులో ఎలాంటి విచారణా లేకుండానే ఖాలిద్ కేసు 14 సార్లు వాయిదా పడింది. విసిగిపోయిన ఖాలిద్ తరఫు న్యాయవాది కేసు ఉపసం హరించుకోవడానికి సిద్ధపడ్డారు. కింది కోర్టులో తమ అదృష్టం పరీక్షించుకుంటామని చెప్పారు. అక్కడా ఇదే తంతు. కుక్క కనిపిస్తే బడితె దొరకదు. బడితె దొరికితే కుక్క కనిపించదు. నికరమైందల్లా వాయిదానే. గత మే 28వ తేదీన కింది కోర్టు ఖాలిద్ కు బెయిలు ఇవ్వడానికి నిరాకరించింది. అప్పుడు ఆయన ట్రయల్ కోర్టుకు వెళ్లారు. అక్కడా ఇదే పరిస్థితి. విచారణా క్రమంలో ఎన్ని అడ్డంకులు ఏర్పడడానికి అవకాశం ఉందో అన్ని అడ్డంకులు ఖాలిద్ కేసులో ఎదురయ్యాయి. ఒక సారి పోలీసులు సంసిద్ధంగా ఉండరు. ఒక సారి ఓ న్యాయమూర్తి విచారణ నుంచి తప్పుకుంటారు. మరో న్యాయమూర్తి పీఠమెక్కుతారు. అప్పుడూ వాయిదా పడుతుంది. మరో సారి ఖాలిద్ తరఫు న్యాయవాది అందుబాటులో ఉండరు. ఉమర్ ఖాలిద్ మీద మోపిన ఆరోపణలు చాలా తీవ్రమైనవి కనక, ఆ ఆరోపణలే నిజమైతే ఈ దేశానికి పెద్ద ముప్పు ఉంటుంది కనక సత్వర విచారణ జరిపించి ఈ దేశాన్ని కాపాడే బాధ్యత ఎవరూ తీసుకోరు. వెరసి ఏ విచారణ జరగకుండానే విచారణ ప్రక్రియే నేరం రుజువైతే పడే శిక్షకన్నా భయంకరంగా ఉంటుంది. ప్రభుత్వానికి కావలసింది ఇదే. నేరం రుజువు చేసే ఆధారాలు లేనప్పుడు వాయిదాలతో గడిపేయడమే ప్రభుత్వానికి ఉత్తమ పద్ధతిగా భాసించడంలో వింతేమీ లేదు. న్యాయ దేవత కళ్లకు ఎటూ గంతలు ఉంటాయి.

వదలని మత్తు

చింతపట్ల సుదర్శన్

మధ్యాహ్నం మూడు గంటలకే అరుగు ఎక్కాడు అబ్బాయి. అప్పటికి ఓ కునుకు తీసి నిద్రలేచి ఆవులిస్తున్న డాగీ ఆశ్చర్యపోయింది. అడుగుల చప్పుడు విని 'ఆఫ్టర్‌నూన్ న్యాప్' ని భంగపరిచిందెవరా అని ఓ కన్నువిప్పి తిప్పిచూసింది డాంకీ. ఏవిటి 'బ్రో' ఇంత ఎర్లీగా వచ్చేశావు అంది డాగీ. గొణుగుళ్లూ, సణుగుళ్లూ ఉన్న కొంపలో ఉండలేక ఇంటికన్నా గుడి పదిలం అని ఇలా వచ్చేశానన్నాడు అబ్బాయి. అదేంటి ఈ కూలిన కొంపను గుడి అంటున్నావా అంది డాంకీ రెండో కన్ను కూడా విప్పి తిప్పకుండా స్టడీగా చూస్తూ. అవును మనకు ఎక్కడ నచ్చితే అక్కడే గుడిబడీ అన్నీ. అడుగడుగున గుడి ఉంది, అందరిలో గుడి ఉంది అన్నారు. ఎకసెక్కాలు, ఎటకారాలు ఉన్న మనుషులకన్నా మీరే నయం. ఇక్కడన్నా కాస్త ప్రశాంతంగా కబుర్లు చెప్పుకోవచ్చు. మనసుకు శాంతి కలిగే చోటే గుడి ముఝే ఓ జగా బతావ్ జహా ఖుదా నహీ అన్నాడో షాహెర్, అందుకే ఇక్కడికి వచ్చాను అన్నాడు అబ్బాయి. గొణుగుళ్లూ, సణుగుళ్లూ, ఎకసెక్కాలు, ఎటకారాలు అంటున్నావ్. ఇంట్లో గొడవలా అని డాంకీ, రాజులు మారినా, పార్టీలు మారినా, జండాలు మారినా మామూలు మనుషుల

రంగస్థలం

బతుకుల్లో మార్పు రావడంలేదని, విరక్తా బ్రదర్ అని డాగీ, డాంకీ అన్నవి. ఎప్పుడూ ఉండే నసే. ఉద్యోగం ఉద్యోగం అంటారు అది రాకముందే వస్తేగిస్తే పెళ్లే నంటారు అది రాదు. ఇది కాదు రానురాను బయట ప్రపంచంలో మనుషులే కాదు సొంత ఇంటి మనుషులు కూడా మారిపోతున్నారు. అవును కదా ఒకప్పుడు పురాణ పురుషులు తర్వాత పుణ్య పురుషులూ ఉండేవారట ఇప్పుడంతా స్వార్థపరులు, పరాన్నభుక్కులే అంది డాగీ. అవును మనుషులే మారారు. కనపడని కొమ్ములూ, తోకలూ మొలిచాయి. మా జాతిని చూడు ఆనాడూ ఈనాడూ విశ్వాసానికి పెట్టింది పేరు మారామా లేదే. ఆనాడూ ఈనాడూ మన డాంకీ జాతివాళ్లు వీపున మూటలు మోస్తూనే ఉన్నారు అంది డాగీ. ఉచిత బస్సులంటారు, ఉచిత పథకాలంటారు కాని ఉద్యోగాల సంగతి, ఉద్యోగాల భృతి సంగతీ పట్టించుకోరు అన్నాడబ్బాయి. అందరికీ ఉద్యోగాలిస్తే, జండాలు మోసే కార్యకర్తలెక్క డ దొరుకుతారు. రాళ్లు విసరడానికి ఎన్నికల్లో స్లిప్పులు రాయడానికి, వెంట తిరగడానికి తాత్కాలిక సేవకులు ఎక్కడ లభిస్తారు అన్నది డాగీ. పల్లకీ మోసే వాడెవ్వడూ, మోసేవాడే, దివిటీ పట్టేవాడు ఎప్పుడూ దివిటీ పట్టేవాడే, దివిటీ పట్టేవాడు ఎప్పుడూ దివిటీ పట్టేవాడే. పల్లకీల్లో ఉన్నవాళ్లు మాత్రం అది దిగరు కాకపోతే ఓ పల్లకీ దిగి మరో పల్లకీ ఎక్కి కూచుంటారు దర్జాగా. 'పవర్' పవరు అలాంటిది మరి, ఓ పట్టాన తృప్తి కలగదు. ఎన్నేళ్లయినా అదే అదే కావాలని పదేపదే కోరుకుంటారు అంది డాంకీ.

కార్యకర్తలెప్పుడూ దిష్టిబొమ్మలే కాని ఛోటా నుంచి బడా నాయకుల దాకా ఇప్పుడు రాణీకాసుల రంగయ్యలే. నిన్న మొన్నటిదాకా లడ్డూలోయ్ లడ్డూలోయ్ అన్నారు ఇప్పుడు లాటరీలోయ్ లాటరీలు అంటున్నారు. ప్రజల్ని ఊరడించి, లాలించి, బుజ్జగించి పాలించడానికి రోజుకో టాపిక్‌ని ఎంచుకుని లాక్కోడం, పీక్కోడం, సాగదీయడం అంతే అన్నాడబ్బాయి. ఇప్పుడు 'హాట్ టాపిక్' ఏంటో? అని అడిగింది డాగీ. ఏముందేముంది అందరి ముందూ ఇప్పుడుంది మందే. పాత మందును పాతరేస్తాం, కొత్త మందుకు లాటరేస్తాం అన్నమాట అంది డాంకీ. మందు షాపులకు లాటరీ వేయడం మామూలేగా. ఎవడి ముఖాన ఏ మందు షాపు రాసుందో ఎవరికెరుక అంది డాగీ. ఎంత అమాయకపు 'స్ట్రీట్ డాగ్' వి నువ్వు. ఆనాడూ, ఈనాడూ, ఏనాడూ ఏ విషయమైనా ఏలిన వారికే కదా ఎరుక, శివుడాజ్ఞ లేనిదే చీమైనా చక్కెర ముక్కున పట్టదు తెలుసా? అవును డాగీ ఏలిన వారూ, పరివారమూ, ప్రమథగణాలూ, అవసరార్థ కూటములూ, ప్రజాప్రతినిధులూ ఉన్నది ఎందుకు పరిపాలనను, స్వసుగమం చెయ్యడానికే కద. కొత్త మందు షాపులు అదే మందుషాపులు కొత్తగా బార్లా తెరవడానికే కద అందుకు లాటరీలు కోటరీలు అంతా మాయాజగమనిత్యమే. ఎవరికి ఏ షాపో లాటరీ కాగితం నిర్ణయిస్తుందనుకోవడం ఒట్టి విష్ణు మాయ. ఏ లాటరీ ఎవరికి రావాలో నిర్ణయించేది మాత్రం మందు బాబులే అన్నాడబ్బాయి. మందు బాబులా అంటే తొంబైలూ, నూటెనభైలూ పుచ్చుకుని నాటకమడుతేసుకునే వారేనా అనడిగింది డాగీ. మందు తాగే మందుబాబులు కాలేయం తడుపుకు చస్తారు కానీ మందు షాపుల ఏర్పాటుకు, కాసులు జమ చేసుకునే వారు, షాపుల కోసం బెదిరింపులు, వాటాలకోసం హెచ్చరికలు చేసేవారు, లాటరీలను పోషించేవారు, శాసించేవారు కూడా మందుబాబులే కాకపోతే మందును కాసుల రూపంలో లాక్కుని దాచుకునే వారే అన్నాడు అబ్బాయి.

తాగేవాడికీ, తాగించే వాడికీ అందరికీ మందు దేవుడే కానీ మొదటి రకం వాడికి మాత్రం యముడే అన్నది డాగీ.

మొత్తం మీద ఇప్పుడు జరుగుతున్నది మందు పండగ, మందు జాతర, మందు పర్వం అన్నమాట అంది డాంకీ.

మావోయిస్టులు ఈ దేశ పౌరులు కాదా?

కూనంనేని సాంబశివరావు
ఎంఎల్ఏ

శ్రీశ్రీ తన కవితలో "సింధూరం, రక్త చందనం, బందూకు, సంధ్యారాగం, పులి చంపిన లేడి నెత్తురూ, ఎగిరేసిన ఎర్రని జెండా, రుద్రాలిక నాయక జ్వాలిక, కలకత్తా కాళికా నాలిక, కావాలోయ్ నవ కవనానికి" అని విప్లవపోరాటాన్ని ఉద్వేగ పరుస్తూ నవ కవనానికి నాందిగా నిప్పు కణికల్లాంటి పదాల కవితద్వారా శక్తిమంతమైన ప్రేరణ కలిగించారు. ఈనాడు పులిచంపిన లేడి నెత్తురు అనగా రాజ్యహింసలో ప్రాణాలు కోల్పోతున్న అభాగ్యులు, అమాయకులు, అలాగే ప్రశ్నించే యోధులు, అన్యాయంపై తిరుగుబాటే జీవితంగా ఎంచుకున్న విప్లవవీరులు నక్సల్స్, మావోయిస్టులు, గోవింద్ పన్సారే, కల్బుర్గీ, దభోల్కర్, గౌరి లంకేష్‌ర్ లాంటి అనేకమంది ప్రశ్నించే యోధులు, కవులు, రచయితలు, మేధావులు రాజ్యహింసకు, రాజ్య కుట్రలకు బలై తమ నెత్తుటి ధారలద్వారా సమాజ చైతన్య వెలుగు కిరణాలుగా మారుతున్నారు. రాజ్యం, ప్రభుత్వం "లేడి నెత్తురు రుచి మరిగిన పులి" లాగా ప్రశ్నించే వారిపై విరుచుకుపడుతూ సమాజంలో భయానక వాతావరణం కల్పిస్తుంటే, రక్షించేవాడే భక్షిస్తుంటే రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వాడే రాజ్యాంగాన్ని విచ్ఛిన్నంచేస్తూ నరమేధంసాగిస్తూ నోరులేని గిరిజనులు, దళితులు, అణగారిన వర్గాలను నిర్మూలించే కార్యక్రమం పెట్టుకుంటే దేశం ఏమైపోతుంది, ఏటువైపు నడుస్తుంది. అన్నార్తులను, అనాథలను కాపాడేది ఎవరు? అందుకే శ్రీ శ్రీ గర్జించిన విధంగా లేడి నెత్తురు నవకవనానికి నాంది పలకడమే కాకుండా ఏదో ఒక రోజు అసమానతలు లేని సమసమాజంతో కూడిన నవోదయానికి ఎర్రబావుటాలై వెలుగుదారి చూపెట్టక తప్పదు. నేడు ఒడిశా, బీహార్, చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ లాంటి రాష్ట్రాల్లోని దండకారణ్యం ప్రాంతంలో ఈ విధమైన భయానకంతో కూడిన ఆటవిక పాలనను పాలకులు కొనసాగిస్తున్నారు. 2026 మార్చి నాటికి మావోయిస్టు కార్యకలాపాలు నిర్మూలిస్తామనీ, మావోయిస్టులకు వ్యతిరేకంగా బలమైన, నిర్దాక్షిణ్య వ్యూహాన్ని అవలంబిస్తామని సాక్షాత్తు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆగస్టు 24న రాయ్‌పూర్‌లో ప్రకటించారు. ఆ ప్రేరణతోనే చత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ సరిహద్దులో గత నెల 3న ఎన్‌కౌంటర్‌గా చెపుతున్న ఘటనలో తొమ్మిది మంది మావోయిస్టులను చంపారు. వెనువెంటనే సెప్టెంబర్ 5న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం పరిధిలో ఆరుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. మొత్తంగా ఒక్క 2024లోనే చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే 136 మంది మావోయిస్టులను చంపేశారు.

రాజ్యహింసలో భాగంగా అది ఏ ప్రభుత్వమైన గానీ 1996 నుంచి 2018 వరకు దాదాపు 15 వేల మంది మావోయిస్టులను హతం చేశారు. ఈ కాలంలో నక్సల్ దాడుల వలన కానీ, పోలీసుల పొరపాట్ల వల్ల కానీ దాదాపు 4000 మంది సామాన్య పౌరులు మరణించారు. నక్సల్స్ అయినా, సామాన్యులైనా మరణించిన వేలాది మందిలో ఎక్కువ భాగం పేద, దళిత, ఆదివాసీలు ఉన్నారనే విషయం గమనార్హం. నిరుద్యోగం, ఆకలి బాధలు, అణిచివేతలు, సామాజిక అవమానాలు, పేదరికం, భూమి సమస్య, చాలీచాలని వేతనాలు, కళ్ల ముందు కనపడే దౌర్జన్యాలు, అక్రమాలపై ఆవేశంతో కూడిన వర్గకసే పేదవారు నక్సల్‌గా మారడానికి కారణం. దీనిని సామాజిక సమస్యగా భావించకుండా శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరిస్తూ అణిచివేత, నిర్మూలన కార్యక్రమాలకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడం ఆటవిక రాజ్యాంగాన్ని తలపిస్తుందే గాని, ప్రజాస్వామ్యం భావన మచ్చుకైనా కలగడంలేదు. ఈ విధమైన నిర్మూలన కార్యక్రమాలు మొదలెట్టి రాజ్యాధికారం, పోలీసు వ్యవస్థ ద్వారా మరెంత మంది నిండు ప్రాణాలు బలితీసుకుంటారు? బలైనవారి భార్య, బిడ్డలు, తల్లిదండ్రులు, వారి ఆక్రందనలు పాలకుల చెవులకు వినపడవా? వారి వేదనలు, బాధలు కనపడవా? కమ్యూనిస్టులు, మావోయిస్టులు, ప్రశ్నించేవారు దేశ ద్రోహులా? వారిని చంపడానికి ఏ చట్టాలు వర్తిస్తున్నాయి? దేశంలో ఈనాటి సమన్యాయం నినాదం వెనుక ఉన్నది కమ్యూనిస్టులు కాదా? తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలర్పించిన 4500 మంది యోధులను అందించినది కమ్యూనిస్టు పార్టీ కాదా? తెలంగాణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, అలాగే దేశంలోని అనేక ప్రాంతాల్లోని పేద ప్రజల కొరకు భూ పోరాటాలు, వెట్టి చాకిరి విముక్తి కొరకు, కుల వివక్షతకు వ్యతిరేకంగా ఉద్యమాలు ప్రారంభించింది కమ్యూనిస్టులు కాదా? ఇంకా దేశం కోసం, తెలంగాణ సమాజం కోసం సర్వస్వం త్యాగంచేసిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్యలాంటి యోధులను అందించినది కమ్యూనిస్టు పార్టీ కాదా? దేశంలోని ప్రతి ప్రగతిగామి చట్టం రూపకల్పన కమ్యూనిస్టుల పోరాట ఫలితం కాదా? ల్యాండ్ సీలింగ్ లాంటి చట్టాల సాధన, 8 గంటల పనిహక్కుగానీ, అటవీ హక్కుల చట్టంగానీ, రైతాంగ చట్టాలు గానీ, విద్యావ్యవస్థలో మార్పులు గానీ, సాంస్కృతిక విప్లవాలుగానీ, తమ కవిత ద్వారా అగ్ని ధార కురిపించిన దాశరథి కృష్ణమాచార్య, అలాగే ఆయన సోదరుడు దాశరథి రంగాచార్య, మాటలను తూటాలుగా పేర్చి నిప్పుకణికలు కురిపించి, సామాజిక విప్లవాగ్నిని రగిలించిన శ్రీశ్రీ, సామాన్యుడి వేదన, శోధనకు ప్రతీకగా నిలిచిన ఆరుద్రలాంటి వారికి ప్రేరణ కల్పించింది కమ్యూనిజం కాదా? సుద్దాల హనుమంతు, గద్దర్‌లాంటి మట్టిలోని మాణిక్యాలను తయారుచేసిన సాంస్కృతిక చరిత్ర గానీ, అనేక మంది విద్యావేత్తలకు సామాజిక ప్రేరణ కలిగించింది వామపక్ష భావజాలం కాదా?

నక్సల్స్ తప్పుచేస్తే కోర్టులు, చట్టాలు మీ చేతుల్లోనే ఉన్నాయి కదా? చట్ట ప్రకారం శిక్షించవచ్చు. ఏ తప్పు చేయనటువంటి వరవరరావు, సాయిబాబా లాంటి మేధావులను కూడా జైళ్లలో నిర్బంధిస్తున్నారు కదా? బెయిల్ వచ్చిన వరవరరావును బయిటికి రాకుండా ఇప్పటికీ అడ్డుకుంటున్నారు కదా? కేంద్ర విజిలెన్స్ సంస్థల ద్వారా ప్రొఫెసర్ హరగోపాల్, జర్నలిస్టు వేణుగోపాల్ లాంటి వారిపైన కూడా ఉపా చట్టాలను ఉపయోగిస్తూ నిర్బంధాలకు గురి చేస్తున్నారు కదా? మంచైనా, చెడైనా కోర్టులను ఉపయోగించుకోకుండా నిర్మూలన కార్యక్రమం తలపెట్టడం వెనుక వున్న రహస్య ఎజెండా ఏంటి? డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విరచిత రాజ్యాంగం ప్రసాదించిన పౌరహక్కులను ప్రశ్నించే గొంతులను అణచివేసే అధికారంమీకు ఏ కొత్త రాజ్యాంగం ఇచ్చింది. మావోయిస్టులుగానీ, మరే నక్సల్ అయినా, కమ్యూనిస్టులు అయినా, ప్రశ్నించేవారు ఎవరైనా దేశ ద్రోహులా? రామకృష్ణ, గణపతి, గణేష్ ఇంకా అనేకమంది బాగా చదువుకున్న మేధావులు తమ కుటుంబాలను త్యాగం చేస్తూ అడవిబాటను ఎంచుకున్నారు. వారి మార్గం తప్పుకావచ్చు, వారి ఆవేశం న్యాయమైనదే. ముక్కుపచ్చలారని రామకృష్ణ కుమారుడు మున్నాను కూడా ఇటీవలే ఎన్‌కౌంటర్ పేరుతో హతం చేసిన అంశాన్ని గుర్తు చేస్తున్నాను. కమ్యూనిస్టు పార్టీకి, నక్సల్స్‌కు విధానపరమైన విభేదాలున్నా ప్రశ్నిస్తే అణిచివేయడం, ప్రశ్నించేవారిని మానవహననం చేయడాన్ని కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా నల్లమల గిరిప్రసాద్ ఉన్న కాలంలో అండదండలు లేక అక్రమ కేసులతో జైళ్లలో మగ్గుతున్న వారిని విడిపించేందుకు సురవరం సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో ఒక లీగల్‌సెల్‌ను, పౌరహక్కుల సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని మరచిపోలేం.

ఇటువంటి ఆటవిక విధానంద్వారా మనుషులను మృగాలుగా చంపుతూపోతుండే ప్రభుత్వాల లక్ష్యం ఏమిటి? దండకారణ్యంలో వున్న సహజవనరులను బహుళజాతి సంస్థలు, బడాకార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికనే విమర్శను తోసిపుచ్చలేం. పోలీసు యంత్రాంగమే కాకుండా చత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలలో సాల్వాజుడుం లాంటి ప్రైవేట్ ఆర్మీని తయారు చేయడం, గ్రీన్‌హంట్ పేరుతో, ఇప్పుడు ఆపరేషన్ కంగారు పేరుతో వేలాది మందిని చంపుకుంటూ రాక్షసానందం పొందడం విచారకరం. చరిత్రలో అణివేతలకు పాల్పడిన రాజుల, చక్రవర్తుల, రాజ్యాలు కూలిపోయాయి. రాజ్యహింస ఏనాడూ విజయం సాధించలేదు. అమిత్‌షా చెప్పినట్లుగా 2026 నాటికి మావోయిస్టులను గానీ, ప్రశ్నించే వారినిగానీ మీరు హతం చేయవచ్చు, సంతోషపడవచ్చు. కానీ, మనిషి ఆలోచనలు, భావాలు, ఆవేదనలు, ఆకలి బాధలు నిరంతరం ఉంటాయి. వాటినుంచే విప్లవాలు పుడతాయి. కూలిపోయిన సమాజం నుంచి చైతన్య పోరాటాలు విలసిల్లుతాయి. సమాజం ఉన్నంత కాలంల ప్రశ్న వుంటుంది. ప్రజలలో భావాలుంటాయి. ప్రశ్న శాశ్వతం. ప్రశ్నను చంపలేరు. భావాలను అణచలేరు. అంతిమంగా ప్రజలే విజేతలు. ప్రపంచంలో హిట్లర్, ముసోలిని దగ్గరనుంచి నిజాం రాజు లాంటి వారెందరో కొంతకాలం మాత్రమే ప్రజలను అణచగలిగారు. అణిచివేతకు గురైన వారే ఉవ్వెత్తున ఉద్యమంగా మారి నియంతలను మట్టికరిపించిన చరిత్రలెన్నో.

మావోయిస్టు సోదరులకు సూచన: నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా ప్రజా ప్రభుత్వం స్థాపించాలనే లక్ష్యంగా గల మీ హక్కును ప్రశ్నించలేం. కానీ ఒక సూచన. ప్రజలను సన్నద్ధం చేసి, చైతన్యపరచకుండా విప్లవబాటను ఎంచుకోవడంలో వృథా త్యాగాలు మిగులుతాయి. హింసకు ప్రతి హింసే సమాధానంగా ప్రభుత్వ రాజ్యహింసకు బలం చేకూర్చే విధంగా కోవర్టుల పేరుతో సామాన్యులను హతమార్చడం (ఇటీవలే రాధ అనే మహిళను కోవర్టు అనే పేరుతో హతమార్చడం జరిగింది), పోలీసు అధికారులు, కిందిస్థాయి పోలీసులను హతమార్చడంవలన ప్రజా సానుభూతిని కోల్పోతున్నారు. కింది స్థాయి పోలీసులు కూడా పేదవారే. వారి కుటుంబ సభ్యుల వేదనను కూడా అర్థం చేసుకోవాలి. ప్రజల సానుభూతి కోల్పోకుండా మద్దతు పొందే విధంగా మన చర్యలు ఉండాలి. ప్రభుత్వ బలగాలు, సైన్యం, పోలీసులతో కూడిన రాజ్యంపై తిరుగుబాటు చేసే క్రమంలో మన ప్రజా బలాన్ని మనకున్న ప్రజాసైన్యం బలాన్ని కూడా అంచనా వేసుకోవాలి. 1947 సెప్టెంబరు 11న రైతాంగ సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహిద్దీన్, బద్దం ఎల్లారెడ్డిలు ఇచ్చిన పిలుపుపై 1948 సెప్టెంబరు 17 వరకు జరిగిన సాయుధ పోరాటం అద్భుత ప్రజావిజయంగా భావించవచ్చు. అంతిమంగా నిజాం నవాబు నుంచి తెలంగాణ విలీన ప్రక్రియ దిగ్విజయంగా జరిగింది. సాయుధ పోరాటం ఆ తదుపరి దాదాపు 1952 వరకు కొనసాగిన క్రమంలో ప్రజా మద్దతు కొరవడటం, వేలాదిమంది అసువులుబాయటం గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరమున్నది. అందువలన సరైన సమయంలో సరైన ఎత్తుగడలను లెనిన్ చూపిన మార్గంలో అనుసరించి ముందుగా ప్రజాశ్రేణులను బలమైన ఉద్యమాలను రూపొందించుకోవలసిన అవసరముంటుంది. ఓబీసీలు, దళితులు, గిరిజనులు, ఉద్యోగ, కార్మిక, అసంఘటిత, కనీస వేతనం పొందని కోట్లాది మందిలో రైతాంగం, వ్యవసాయ కూలీలులాంటి వర్గాల్లో పట్టును సాధించుకొని విప్లవ పరివర్తన సాధనకు కృషి చేయవలసిన అవసరముంది. ప్రజలకు వ్యతిరేకంగా బలప్రయోగానికి, హింసకు దోపిడీ వర్గాలు ఒడిగట్టే పక్షంలో మనకున్న సమ ప్రజాబలంతో వారి హింసను, బలప్రయోగాన్ని తిప్పి కొట్టే తిరుగుబాటు మార్గాన్ని ఎంచుకోవచ్చు. 1964లో కమ్యూనిస్టు ఉద్యమచీలిక ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా దేశానికి తీవ్ర నష్టం కలిగించింది. కమ్యూనిస్టులందరూ కలవాల్సిన సమయం ఉత్పన్నమయింది. ఈ దేశంలో పేద ప్రజలు, అణగారిన వర్గాలు, మేధావులు, కమ్యూనిస్టుల ఏకీకరణకు ఎదురు చూస్తున్నారు. ఆ రోజు మరెంతో దూరంలేదని అశిద్దాం.

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తయ్యేనా?

ఎం.ఎల్ నారాయణ

నాగార్జునసాగర్ కుడి కాలువను కుదించి రెండవదశ పేరుతో కాలువను కురిచేడు వరకు ఆపివేసిన క్రమంలో ప్రకాశంజిల్లా పశ్చిమ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగింది. ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలు రాకముందే పశ్చిమ ప్రాంతంలో భూగర్భ జలాలు అంతరించి ఎడారిగా మారుతుందని కీ.శే. గుజ్జుల యలమందారెడ్డి, పూల సుబ్బయ్య, సానికొమ్ము కాశిరెడ్డి, కోటపాటి గురుస్వామి రెడ్డి, తుపాకుల బసవయ్య, దొనకొండ భూపాల్ రెడ్డి, ఆవుల ఈశ్వర్ రెడ్డి, రావులపల్లి చెంచయ్య లాంటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఎప్పుడో చెప్పారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి ప్రాంతాలను సంరక్షించుకోవాలంటే కృష్ణా జలాల సాధనే ఏకైక పరిష్కారం అని భావించి సీపీఐ, రైతు సంఘాల నాయకత్వంలో అనేక పోరాటాలు చేశారు. సీపీఐ నాయకుల ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ నుంచి పుట్టిందే వెలుగొండ ప్రాజెక్టు. 1983లో ఎన్టీ రామారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తరువాత మార్కాపురం శాసనసభ్యులు పూల సుబ్బయ్య ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతాలను కరవు నుంచి రక్షించాలన్నా ఈ ప్రాంతం ఎడారి కాకుండా కాపాడాలన్నా వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణమే ఏకైక పరిష్కార మార్గమని కోరడంతో పూల సుబ్బయ్య పేరుతో ఎన్టీ రామారావు జీవో చేసి సమగ్ర సర్వేకు 1984లో ఆదేశించి ప్రముఖ ఇంజనీర్ శివరామకృష్ణయ్యకి బాధ్యతలు అప్పగించారు. శివరామకృష్ణయ్యను గుజ్జుల యలమందారెడ్డి, పూల సుబ్బయ్య, ప్రొఫెసర్ నాగిరెడ్డి కలిసి ప్రాజెక్టు రూపకల్పనపై చర్చించి కొంత సమాచారం ఇచ్చారు. శివరామకృష్ణయ్య సమగ్రంగా పరిశీలించి సర్వే నిర్వహించి సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల వద్ద కొండల మధ్య అంతరాలను పూడ్చటంద్వారా రిజర్వాయర్ నిర్మించాలని, కొర్తి కనుమల మధ్య 18.5 కిలోమీటర్ల సొరంగం నిర్మించడం ద్వారా రిజర్వాయర్‌కు కృష్ణా నీటిని తీసుకువచ్చే అవకాశం ఉందని, అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనంపొందే అవకాశం ఉందన్న సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. తదనంతరం వెలుగొండ ప్రాజెక్టు పనులు త్వరితగతిన ప్రారంభించాలని పూల సుబ్బయ్య, గుజ్జుల యల్లమందరెడ్డి, సానికొమ్ము కాశిరెడ్డి, కోటపాటి గురుస్వామి రెడ్డి, సురా పాపిరెడ్డి, చప్పిడి వెంగయ్య, ఉడుముల వెంకట్ రెడ్డి, ఇంజనీరింగ్ రిటైర్డ్ ప్రొఫెసర్ నాగిరెడ్డితో పాటు అనేకమంది సీపీఐ నాయకులు అనేక రూపాయలలో పోరాటాలు నిర్వహించడం ద్వారా 1996లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు చేయని కారణంగా చాలా కాలం పాటు నిర్మాణం ఆగిపోయింది. 2004లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన జలయజ్ఞం కార్యక్రమంలో వెలుగొండ ప్రాజెక్టును చేర్చి, నిర్మాణ పనులు ప్రారంభించాలన్న సీపీఐ ప్రతినిధి బృందానికి ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించడమే కాకుండా ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుగా నామకరణం చేశారు. ఈ ప్రాజెక్టు కృష్ణా మిగులు జలాల ఆధారంగా నిర్మితమవుతున్నది. 43.50 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ప్రకాశం,నెల్లూరు, కడప జిల్లాలోని 36 మండలాలకు సంబంధించి 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు. పదిహేను లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. 1996 లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నాటి నుంచి ఒక్క వైఎస్ రాజశేఖర్ రెడ్డిని మినహాయిస్తే ప్రతి ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే సుమారు 30 సంవత్సరాలు గడుస్తున్నా ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయారు. ఈ ప్రాజెక్టును రాజకీయ పార్టీలు అధికారం కోసం ఎన్నికల వాగ్దానంగానే వాడుకుంటున్నాయి తప్ప చిత్తశుద్ధితో ప్రాజెక్టును పూర్తి చేయలేకపోతున్నాయి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారానికి రాక మునుపు మా నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రాజెక్టు పనులు ప్రారంభించారు ఆయన వారసుడిగా నాకు అధికారం ఇవ్వండి నేను ముఖ్యమంత్రి అయిన మొదటి సంవత్సరంలోనే పూర్తి చేస్తానని జిల్లా ప్రజలను నమ్మించి 2019 ఎన్నికలలో లబ్ది పొందారు. ఐదు సంవత్సరాల కాలంలో నిధులు సక్రమంగా ఇవ్వని కారణంగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయలేకపోయినా, రెండవ టన్నెల్ పూర్తి అయ్యింది ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నానని ప్రకటించి 2024 ఎన్నికల్లో కూడా లబ్ది పొందాలని ప్రయత్నించి జిల్లా ప్రజల తిరస్కారానికి గురయ్యారు. ఎన్నికల ముందు వరకు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు 1996లో నేనే శంకుస్థాపన చేశాను, తిరిగి 2024లో నాకు అధికారం ఇస్తే ప్రాజెక్టును ముఖ్యమంత్రి అయిన మొదటి సంవత్సరంలోనే పూర్తి చేస్తానని నమ్మబలికారు. ప్రజలు మరోసారి విశ్వసించి ప్రకాశం జిల్లాలో అత్యధిక స్థానాలలో టిడిపిని గెలిపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి వంద రోజులు దాటిపోయింది. కానీ ఇంతవరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టు ప్రస్తావనే చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఇంకా ప్రవేశపెట్టలేదు. జిల్లా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన నిధులు కేటాయించి మొదటి సంవత్సరంలోనే ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లా ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించాల్సిన అవశ్యకత ఎంతో ఉన్నది. వర్ణనాతీతంగా మారిన నిర్వాసితుల సమస్య : ఈ ప్రాజెక్టు (నల్లమల సాగర్) ముంపులో 11 గ్రామాల ప్రజలు ఉన్నారు. ఆ గ్రామాల ప్రజల పరిస్థితులు వర్ణనాతీతంగా మారాయి. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా వారికి నష్టపరిహారం చెల్లించి, పునరావాసంలో భాగంగా వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వవలసి ఉండగా, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం అందవలసిన పరిహారం అందలేదు. ముంపు గ్రామాలలో తాగటానికి నీరులేదు. బోర్వెల్ వేయించుకొని ప్రజల దాహార్తిని తీర్చాలంటే అధికారులు బోర్వెల్ వేయటానికి అనుమతి లేదని ఆపించేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా అంటే నిధులు కొరత కారణంగా అది సక్రమంగా జరగడం లేదు. అక్కడే ఉండాలా లేక అక్కడనుంచి వెళ్లి పోవాలో దిక్కుతోచని స్థితిలో 11 గ్రామాల ప్రజలు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో పునరావాస ప్యాకేజీ కింద రూ 12,50 లక్షలు ఒక్కొక్క కుటుంబానికి ఇస్తాం, మీరు గ్రామాలను విడిచి వెళ్లండి అంటే వారందరూ ఒప్పుకున్నారు. కానీ అది కూడా ఇవ్వని కారణంగా అనేక బాధలకు ఓర్చుకుంటూ అక్కడే తల దాచుకుంటున్నారు.ఆ మొత్తం ఇవ్వకపోవడంతో వారక్కడే ఉంటున్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ముంపు గ్రామాల ప్రజల బాధలను అర్థం చేసుకొని వారికి ఇవ్వవలసిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాస ప్యాకేజీని వెంటనే ఇచ్చి సురక్షిత ప్రాంతాలలో నివాసంఉండే విధంగా చూడాలి. ప్రాజెక్టును పూర్తిచేసి నీరు అందించాలన్నా, ప్రాజెక్టులో నీరు నింపాలన్న ప్రస్తుత పరిస్థితిలో ఇంకా 1800 నుండి 2000 కోట్ల రూపాయల వరకు అవసరం అవుతాయి. 2004లో ప్రాజెక్టు పనులు ప్రారంభించిన సందర్భంలో రూ. 1473 కోట్ల అంచనాలతో ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 2000 కోట్లు వెంటనే విడుదల చేయాలి. కృష్ణా డెల్టాకు పట్టిసీమ నీటి తరలింపు ద్వారా స్థిరీకరించడం వల్ల, కృష్ణా నదిలో 80 నుంచి 100 టీఎంసీల వరకు శ్రీశైలం రిజర్వాయర్‌లోనే నిల్వచేసి, రాయలసీమతోపాటు పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు నికర జలాలు కేటాయించాలి.



(నేడు మార్కాపురంలో సీపీఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న సందర్భంగా ఈ వ్యాసం)

సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి సెల్: 7997620229

ఏసీ, సోఫాలు ఎత్తుకెళ్లారు

తేజస్విపై బీజేపీ ఆరోపణలు

పాట్నా: రాష్ట్రీయ జనతా దళ్ నేత, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌పై బీజేపీ ఆరోపణలు గుప్పించింది. అధికారిక నివాసాన్ని ఖాళీ చేసే సమయంలో అందులోని వస్తువులను తేజస్వి ఎత్తుకెళ్లారని ఆరోపించింది. ఏసీ, సోఫాలు, బెడ్, ట్యాప్‌లు వంటివి కనిపించలేదని పేర్కొంది. ఆర్జేడీ-జేడీయూ-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం హయాంలో తేజస్వీ ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రభుత్వం పడిపోవడంతో డిప్యూటీ సీఎం పదవి కోల్పోయారు. ఆ సమయంలో పాట్నాలోని ఆయన అధికారిక నివాసాన్ని ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీకి కేటాయిస్తూ ఇటీవల నితీశ్ కుమార్ సర్కారు నిర్ణయం తీసుకుంది. దీంతో గత ఆదివారం తేజస్వీ ఈ నివాసాన్ని ఖాళీ చేశారు. ఆ తర్వాత వెళ్లి చూడగా అందులోని చాలా వస్తువులు కనిపించలేదని బీజేపీ మీడియా ఇన్‌ఛార్జ్ దానిశ్ఇక్బాల్ వెల్లడించారు. ఏయే వస్తువులు తీసుకెళ్లారో ఆ జాబితాను త్వరలోనే విడుదల చేస్తామన్నారు.

బొగ్గు గనిలో పేలుడు... ఏడుగురి దుర్మరణం

బీర్భూమ్: పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలో సోమవారం ఓ బొగ్గుగనిలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు చనిపోగా, చాలామంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. గంగారామ్‌చక్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన గనిలో బొగ్గు వెలికి తీసేందుకు బాంబులు పెడుతుండగా ఈ పేలుడు సంభవించినట్టు తెలుస్తోంది. పేలుడు శబ్దంతో కార్మికులు పరుగులు తీశారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అక్కడే చిక్కుకున్న కొంతమంది కార్మికులను సురక్షితంగా బయటకు తరలించారు. పేలుడు ధాటికి బొగ్గు గని సమీపంలోని పార్కింగ్ వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి.

ఆప్ ఎంపీ నివాసంలో ఈడీ సోదాలు

గురుగ్రామ్: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోధా నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) అధికారులు సోదాలు చేపట్టారు. భూ అక్రమాల వ్యవహారానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ తనిఖీలు జరుగుతున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. పంజాబ్‌లోని లూథియానాలో గల ఎంపీ నివాసం, కార్యాలయంతో పాటు ఇతర వ్యక్తుల ఇళ్లల్లోనూ ఈడీ అధికారులు సోమవారం ఉదయం నుంచి తనిఖీలు చేస్తున్నారు. ఈ పరిణామాలపై ఎంపీ సంజీవ్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఈ సోదాలకు గల కారణాలు ఏమిటో నాకు తెలియదు. కానీ చట్టాన్ని అనుసరించే పౌరుడిగా దర్యాప్తు సంస్థలకు పూర్తి సహకారం అదిస్తాను' అని పేర్కొన్నారు. అటు ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్య మంత్రి మనీశ్ సిసోడియా మాట్లాడుతూ... 'మా పార్టీని విచ్ఛిన్నం చేసేందుకే ఇలాంటా దాడులు చేస్తున్నారని కేంద్రంపై మండిపడ్డారు. కానీ ఆప్ నేతలను ఎవరూ ఆపలేరు... కొనలేరు... భయపెట్టలేరు' అని పరోక్షంగా బీజేపీపై ధ్వజమెత్తారు. ఇప్పటికే ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మాజీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సహా పలువురు ఆప్ నేతలు ఈడీ, సీబీఐ విచారణ ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రస్తుతం వీరిద్దరూ బెయిల్‌పై విడుదలయ్యారు.

యూపీలో 'ఇండియా' వ్యూహం

- ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల్లో లాభపడిన ఐక్య సంఘటన
- రాష్ట్రంలో 10 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు సమాయత్తం
- బీజేపీని ఓడించడమే లక్ష్యమన్న కాంగ్రెస్, ఎస్పీ

లక్నో : దేశంలో కాషాయ బీజేపీ పార్టీ ఓటమే లక్ష్యంగా ఇండియా ఐక్య సంఘటన అడుగులు వేస్తోంది. ఈ దిశగా భాగస్వామ్య పార్టీలన్నీ ముందుకు సాగుతూ వ్యూహ రచన చేస్తున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 40 కంటే ఎక్కువ స్థానాలను గెలుచుకున్న తరువాత ఉత్తర ప్రదేశ్‌లోని 10 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికలపై ఐక్య సంఘటన ప్రధానంగా దృష్టి సారించింది. రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్ బీజేపీ సర్కార్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తమ అస్త్రంగా మార్చుకునేందుకు పావులు కదుపుతున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పార్లమెంటులో బీజేపీ సాధారణ మెజారిటీని సాధించడంలో విఫలమవడానికి 'ఇండియా' గణనీయంగా కృషి చేసింది. రాష్ట్రంలోని 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల సందర్భంగా బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని, ఉప ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ పీటీఐతో మాట్లాడుతూ 'ఎన్నికలు జరగనున్న మొత్తం 10 అసెంబ్లీ స్థానాలపై పార్టీ 'సంవిధాన్ బచావో సమ్మేళన్' నిర్వహిస్తోంది. ఇప్పటికే అలాంటి రెండు సమావేశాలు జరిగాయి. మేము మొత్తం 10 స్థానాలకు ఇంచార్జిలు, పరిశీలకులను నియమించాం. క్షేత్రస్థాయిలో విశ్లేషణ జరుగుతోంది' అని తెలిపారు. ఉప ఎన్నికలు జరగనున్న అసెంబ్లీ స్థానాలు... కతేహరి, కర్హల్, మిల్కిపూర్, మీరాపూర్, ఘజియాబాద్, మఝ్వాన్, సిషామౌ, ఖైర్, ఫుల్పూర్, కుందర్కి. లోక్‌సభ ఎన్నికల్లో తమ ఎమ్మెల్యేలు ఎంపీలుగా ఎన్నికయిన తర్వాత వీటిలో తొమ్మిది స్థానాలు ఖాళీ అయ్యాయి. నేర కేసులో దోషిగా తేలిన సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) ఎమ్మెల్యే ఇర్ఫాన్ సోలంకిపై అనర్హత వేటు కారణంగా సిషామౌ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుంది. ఈ ఉప ఎన్నికల్లో పొత్తు కొనసాగుతుందని భావిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు రాయ్ స్పందిస్తూ... 'అవును.. కూటమిగా పోటీ చేస్తాం. బీజేపీని ఓడించడమే కాంగ్రెస్, ఎస్పీ రెండింటి లక్ష్యం. మాఝ్వా, ఫుల్‌పూర్, ఘజియాబాద్, ఖైర్, మీరాపూర్‌లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలనే ప్రతిపాదనను మేము మా నాయకత్వానికి ఇచ్చాం. ఇవి బీజేపీ అభ్యర్థులు గెలిచిన స్థానాలు' అని రాయ్ చెప్పారు. కాగా, 2022 అసెంబ్లీ ఎన్నికలలో సిసమావు, కతేహరి, కర్హల్, మిల్కిపూర్, కుందర్కి స్థానాలను సమాజ్‌వాది పార్టీ గెలుచుకుంది. కాగా, ఫుల్పూర్, ఘజియాబాద్, మఝ్వాన్, కహీర్ బీజేపీ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మీరాపూర్ స్థానాన్ని రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్‌డీ) కైవసం చేసుకుంది. దీనికి సంబంధించి సమాజ్‌వాదితో పార్టీ ఏమైనా చర్చలు జరిపిందా అని అడిగినప్పుడు రాయ్ మాట్లాడుతూ 'ఒక సమావేశం జరిగింది. దానిపై చర్చించారు. మేము దాని గురించి నాయకత్వానికి, మా యూపీ ఇంచార్జి అవినాష్ పాండేకి చెప్పాము' అని అన్నారు. ఉపఎన్నికల్లో పొత్తు కొనసాగుతుందని మీరు భావిస్తున్నారా అని ప్రత్యేకంగా అడిగిన ప్రశ్నకు రాయ్ స్పందిస్తూ, 'అవును, 100 శాతం. ఉమ్మిద్ నహీ, పక్కా హై' అని అన్నారు. ఏప్రిల్-మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్య పార్టీలైన సమాజ్‌వాదీ పార్టీ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్‌కు ఆరు సీట్లు వచ్చాయి. బీజేపీ 33 సీట్లు గెలుచుకోగా, దాని మిత్రపక్షమైన రాష్ట్రీయ లోక్ దళ్, అప్నాదళ్ వరుసగా రెండు, ఒక సీటు గెలుచుకున్నాయి. ఆజాద్ సమాజ్ పార్టీ ఒక సీటు గెలుచుకుంది. ఉప ఎన్నికల గురించి పీటీఐ అడిగినప్పుడు ఎస్పీ ప్రధాన అధికార ప్రతినిధి, జాతీయ కార్యదర్శి రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ 'మేము ఎన్నికలకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. ఇండియా ఐక్య సంఘటన మొత్తం 10 స్థానాలను గెలుచుకుంటుంది' అని తెలిపారు. సీట్ల పంపకం, కాంగ్రెస్ ఐదు సీట్ల డిమాండ్‌పై ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకత్వం నిర్ణయిస్తుందని చెప్పారు. ఈసారి పోలింగ్ కేంద్రాల వద్ద బీజేపీ వాంఛనీయంగా ఏమీ చేయలేదని అన్నారు. బూత్ స్థాయి వరకు సన్నాహాలు చేస్తున్నామని, బూత్ స్థాయిలో మా పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామని చౌదరి తెలిపారు. ఇదిలాఉండగా, ఉప ఎన్నికల తేదీలు ఇంకా ప్రకటించలేదు. ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ కన్నౌజ్ నుంచి ఎంపీగా ఎన్నికయిన కారణంగా కర్హల్ సీటు ఖాళీ కాగా, అంబేద్కర్ నగర్ లోక్ సభ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయిన తర్వాత పార్టీ లాల్జీ వర్మ చేత కాటేహరి ఖాళీ చేశారు. ఎస్పీ నాయకుడు అవదేశ్ ప్రసాద్ అయోధ్య నుంచి లోక్‌సభకు ఎన్నికవడంతో మిల్కీపూర్ స్థానానికి రాజీనామా చేశాడు. మొరాదాబాద్‌లోని ఎస్పీ నాయకుడు జియా-ఉర్ రెహమాన్ బార్క్‌కు చెందిన కుందార్కి అసెంబ్లీ స్థానం సంభాల్ లోక్‌సభ స్థానానికి ఎన్నికయిన తర్వాత ఖాళీ అయింది. బిజ్నోర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయిన తర్వాత రాష్ట్రీయ లోక్‌దళ్‌కు చెందిన చందన్ చౌహాన్ ముజఫర్‌నగర్‌లోని మీరాపూర్ అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేశారు. ఘజియాబాద్ లోక్‌సభ స్థానానికి బీజేపీకి చెందిన అతుల్ గార్గ్ ఎన్నికవడంతో ఘజియాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. భాదోహి నుండి లోక్‌సభకు ఎన్నికయిన తర్వాత బీజేపీకి చెందిన వినోద్ కుమార్ బింద్ తన మఝాపూర్ అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేశారు. పార్టీ నాయకుడు అనూప్ సింగ్ అలియాస్ అనూప్ ప్రధాన్ బాల్మీకి హత్రాస్ లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికవడంతో అలీఘర్‌లోని ఖైర్ అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేశారు. బీజేపీకి చెందిన ప్రవీణ్ పటేల్ ఫుల్పూర్ లోక్‌సభ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికవడంతో ప్రయాగ్‌రాజ్‌లోని ఫుల్పూర్ అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేశారు.

బహుజనులకు హక్కులు కల్పించే

రాజ్యాంగాన్ని పరిరక్షిస్తాం

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : బహుజనులకు హక్కులను కల్పించే రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ రక్షిస్తుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం తెలిపారు. అయితే ప్రతి భారతీయుడు సహృదయంతో, సోదర భావంతో పోరాడినప్పుడే వారి హక్కులుగానీ, సమాజంలో అందరికీ నిజమైన చేరిక, సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. ఇటీవల దళితులు ఇంటిలో వారి వంట గదిలో భోజనం వండటంలో సహాయపడిన వీడియోను గాంధీ సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. 'నేటికీ దళితుల వంట గది గురించి చాలా తక్కువ మందికి తెలుసు. షాహు పటోలే అన్నట్లు, దళితులు ఏమి తింటారో ఎవరికీ తెలియదు. వారు ఏమి తింటారు. ఎలా వండుతారు. దాని సామాజిక, రాజకీయ ప్రాముఖ్యత గురించి ఆసక్తిగా, నేను అజయ్ తుకారాం సనదేతో ఒక మధ్యాహ్నం గడిపాను' అని వీడియోతో హిందీలో పోస్ట్ చేశారు. 'వంటగదిలో సహాయం చేయదానికి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో వారి ఇంటికి నన్ను ఆహ్వానించడం ద్వారా వారు నన్ను సత్కరించారు. మేము కలిసి 'చానే కే సాగ్ కి సబ్జీ', 'హర్భార్యాచి భాజీ', 'తువర్ దాల్ ని వంకాయతో వండాము' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పేర్కొన్నారు. 'కులం, వివక్షతో పటోల్, సనాదే కుటుంబానికి చెందిన వ్యక్తిగత అనుభవాలను చిత్రీకరించడం, దళితుల వంటకాల గురించి అవగాహన లేకపోవడం, ఈ సంస్కృతిని చిత్రీకరించడానికి సంబంధించిన ప్రాముఖ్యత గురించి మేము చర్చించాము' అని తెలిపారు. రాజ్యాంగం బహుజనులకు వాటా, హక్కులను ఇస్తుందని, తాము రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని అన్నారు.

అయితే ప్రతి భారతీయుడు మనస్ఫూర్తిగా సోదర భావంతో పోరాడినప్పుడే వారి హక్కులుగానీ, సమాజంలో అందరికీ నిజమైన చేరిక, సమానత్వం సాధ్యమవుతుందన్నారు. కాగా, వీడియోలో గాంధీ వంటగదిలో సహాయం చేస్తూ, ఆపై వారి కుటుంబ సభ్యులతో భోజనం చేస్తున్న దృశ్యాలు ఉన్నాయి. దళితులు తినే ఆహారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడానికి తాను మరాఠీలో ఒక పుస్తకాన్ని రచించానని, ఇప్పుడు 'దళిత్ కిచెన్స్ ఆఫ్ మరాఠ్వాడా' అని ఆంగ్లంలోకి అనువదించినట్లు షాహు పటోలే... రాహుల్ గాంధీకి తెలిపారు.

పీడీపీ మద్దతు స్వీకరిస్తాం: ఫరూఖ్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటు కోసం కాకపోయినా... పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ మద్దతును తమ పార్టీ స్వీకరిస్తుందని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధినేత ఫరూఖ్ అబ్దుల్లా తెలిపారు. జమ్మూకశ్మీర్‌ను రక్షించడానికి అన్ని పార్టీలు కలిసి ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్సీ కూటమి విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో ఆ కూటమికి మద్దతు ఇచ్చేందుకు పీడీపీ సిద్ధంగా ఉందన్న వార్తలపై ఫరూఖ్ అబ్దుల్లా స్పందించారు. 'మాకు అవసరం లేకపోయినా, మేం (పీడీపీ) మద్దతు తీసుకుంటాం. ఎందుకంటే మనం ముందుకు వెళ్లాలంటే కలిసి పని చేయాలి. ఈ రాష్ట్రాన్ని కాపాడటానికి మనమందరం కృషి చేయాలి. ఈ రాష్ట్రం చాలా ఇబ్బందుల్లో ఉంది' అని అన్నారు.

కాగా, ఎన్నికల తర్వాత పొత్తుపై మెహబూబా ముఫ్తీతో తాను మాట్లాడలేదని ఫరూఖ్ అబ్దుల్లా స్పష్టం చేశారు. తమ కూటమికి మద్దతిస్తానన్న ఆమెకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. మేమంతా కలిసి ఈ రాష్ట్రాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తామని అన్నారు. మరోవైపు ఎగ్జిట్‌పోల్స్ అంచనాలపై తాను ఉత్సాహంగా లేనని ఫరూఖ్ అబ్దుల్లా తెలిపారు. ఎందుకంటే ఎగ్జిట్‌పోల్స్ సరైనవి లేక తప్పు కూడా కావచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ తర్వాతే అసలు ఫలితాలు వెల్లడవుతాయని చెప్పారు. అయితే ఎన్సీ, కాంగ్రెస్ కూటమి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తాము ఆశిస్తున్నామని అన్నారు.

సెక్యులర్ పార్టీకే మా మద్దతు: పీడీపీ

కశ్మీర్ ఎన్నికల్లో ఏ పార్టీకి కానీ, కూటమికి కానీ ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ రాకపోవచ్చంటూ అనేక ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడంతో ప్రభుత్వం ఏర్పాటుకు కలిసొచ్చే కాంబినేషన్లు, ముఖ్యంగా పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పీడీపీ) మద్దతు ఎవరికి ఉండవచ్చనే దానిపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. దీనిపై పీడీపీ తాజాగా స్పష్టత ఇచ్చింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే ఏ సెక్యులర్ పార్టీకి మద్దతు ఇవ్వాలనే దానిపై ఒక నిర్ణయం తీసుకుంటామని ఆ పార్టీ పేర్కొంది. పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఇప్పటికే జమ్మూకశ్మీర్‌లో రాబోయేది సెక్యులర్ ప్రభుత్వమేనని, తమ పార్టీ మద్దతు లేకుండా ఎవరూ ప్రభుత్వం ఏర్పాటు చేయలేరని ప్రకటించారు. దీనిపై మెహబూబా ముఫ్తీ చీఫ్ అడ్వయిజర్ ఇల్తిజా ముఫ్తీ సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మరింత స్పష్టత ఇచ్చారు. 'ఈ విషయంలో మా పార్టీ చాలా స్పష్టంగా ఉంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే మద్దతు విషయంలో నిర్ణయం తీసుకుంటాం. సెక్యులర్ ఫ్రంట్‌కు మాత్రమే మా మద్దతు ఉంటుంది' అని చెప్పారు.

అదృశ్యమైన వ్యాపారి మృతదేహం లభ్యం

మంగళూరు: కర్నాటకలో అదృశ్యమైన ప్రముఖ వ్యాపారవేత్త బీఎం ముంతాజ్ అలీ (52) శవమై తేలారు. నిన్నటినుంచి దాదాపు 12 గంటల పాటు గాలింపు చేపట్టిన పోలీసులు... సోమవారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు మంగళూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మెయిదీన్ సోదరుడు. బీఎం ముంతాజ్ అలీ ఆదివారం ఉదయం అదృశ్యమైన ఘటన కర్నాటకలో తీవ్ర కలకలం రేపింది. ధ్వంసమైన అతడి కారును కుల్లూరు వంతెన సమీపంలో వదిలివెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ అంశంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే, అతడి ఆచూకీ కోసం 12 గంటలుగా శ్రమించి చివరకు ఫాల్గుణి నది ముఖద్వారం వద్ద అతడి మృతదేహాన్ని గుర్తించారు. ప్రముఖ వ్యాపారిగానే కాకుండా అతడు మిస్బా గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అలీ అదృశ్యంపై కావూరు పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. అతడిని డబ్బుల కోసం బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేసిన ఆరోపణలపై ఓ మహిళతో పాటు ఆరుగురిని నిందితులుగా పేర్కొన్నారు. సోమవారం అలీ మృతదేహాన్ని వెలికితీసినట్లు మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ వెల్లడించారు. మరణానికి గల కారణాలను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఎయిర్ షోలో మరణాలకు తొక్కిసలాట కారణం కాదు: డీఎంకే

చెన్నై: తమిళనాడులోని మెరినీ బీచ్ రోడ్డులో ఆదివారం నిర్వహించిన వైమానిక దళ ఎయిర్ షోలో చోటు చేసుకున్న విషాదంలో ఐదుగురు మృతి చెందడంతో డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి. తొక్కిసలాట, నిర్వహణ లోపం వల్ల ఈ పరిస్థితి తలెత్తలేదని రాష్ట్ర ప్రభుత్వం ఆ విమర్శలకు బదులిచ్చింది. అస్వస్థతతో ఆస్పత్రికి చేరిన చాలామంది డిశ్చార్జి అయ్యారని, చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉందని డీఎంకే నేత శరవణన్ అన్నాదురై వెల్లడించారు. మరణాలకు తొక్కిసలాట కారణం కాదన్నారు. భారీగా వైమానికి విన్యాసాలు నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఆదివారం సుమారు ఐదు లక్షల మంది వచ్చినట్టు రక్షణదళాలు ప్రకటించాయి. తీరం వెంబడి సుమారు 15 కిలోమీటర్ల మేర జనాభా గుమిగూడారు. ప్రారంభ సమయానికి దారులన్నీ మూసుకుపోయాయి. విన్యాసాలు పూర్తవగానే ఎవరూ ఎటూ వెళ్లలేని పరిస్థితి. బీచ్ రోడ్‌లో నీటి వసతి లేకపోవడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో బాధితుల సంఖ్య పెరిగింది. ట్రాఫిక్ ఇబ్బందులను తప్పించుకునేందుకు కొందరు సబ్ అర్బన్, మెట్రో రైళ్లను ఆశ్రయించగా, స్టేషన్‌లలో తోపులాట జరిగింది. దీనిపై అన్నా డీఎంకే, బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించాయి. సమన్వయలోపం, తగిన ఏర్పాట్లు లేకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని అన్నాడీఎంకే అధ్యక్షుడు పళనిస్వామి దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సహా కీలకనేతలు రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. 'ఈ ఈవెంట్‌ను తగిన రీతిలో నిర్వహించాం. ఐదురుగు ప్రాణాలు కోల్పోవడానికి గల కారణాలను విచారిస్తున్నాం. షో సమయంలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ప్రజలు ఎక్కువ దూరం నడవాల్సి వచ్చింది. దీనిని రాజకీయం చేసేందుకే డీఎంకే ప్రభుత్వాన్ని నిందిస్తుందని శరవణ్ అన్నారు. ఈ విషయమై డీఎంకే ఎంపీ కనిమొళి ఎక్స్ వేదికగా స్పందించారు. ఎయిర్ షో చూసేందుకు వచ్చి రద్దీ కారణంగా ఐదుగురు మృతిచెందిన విషయం తనను కలిచివేసిందన్నారు.

బెంగళూరుకు నీటి సంక్షోభం తప్పదు

నీటి సంరక్షకుల హెచ్చరిక

బెంగళూరు: బెంగళూరుకు నీటి సంక్షోభం తప్పదని నీటి సంరక్షకులు హెచ్చరించారు. బెంగళూరులో నీటి సంక్షోభం తీవ్రమౌతోందని, భవిష్యత్తులో జీరో వాటర్ డేస్ ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు. 'కమ్యూనిటైజేషన్' (బృందం)గా ఏర్పడటం లేదా సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా నీటి సంరక్షణకు కమ్యూనిటీ చొరవ చూపాల్సి ఉందని సొసైటీ ఫర్ కమ్యూనిటీ హెల్త్ అవేర్‌నెస్ రీసెర్చ్ అండ్ యాక్షన్ (ఎస్‌ఓసీహెచ్ఏఆర్ఏ) కార్యదర్శి ప్రఫుల్లా సాలిగ్రామ్ పేర్కొన్నారు. ఈ విధానం బెంగళూరు నీటి సమస్యను పరిష్కరించగలదని ఆమె అభిప్రాయపడ్డారు. 'మనకు 200, 300 ఏళ్ల క్రితం 400 దాకా సరస్సులు ఉండేవి. తగిన పర్యవేక్షణ లేకపోవడంతో అవి కనుమరుగయ్యాయి. అదే సమయంలో బాహ్య నీటివనరులపై మనం ఆధారపడటం విపరీతంగా పెరిగింది. మా సంస్థ తరపున నిరుపేదలకు అత్యవసరమైన ఆరోగ్య అవసరాలు అందించేందుకు యత్నిస్తాం. దీనికోసం తాము మాయాబజార్, అంజనాపురాకు చెందిన వారిని కమ్యూనిటీగా చేస్తున్నాం. నివాసితులు, సంక్షేమ సంఘాల సభ్యులు కమ్యూనిటైజేషన్... బెంగళూరు నీటి సంక్షోభాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది' అని అన్నారు. నీటి సంరక్షణకు కమ్యూనిటైజేషన్ చాలా కీలకమని హెన్నూర్ టాస్కర్స్ గ్రూప్ సభ్యుడు కె.సుబ్రమణియన్, వెల్ ల్యాబ్స్ డైరెక్టర్ వీణా శ్రీనివాసన్ పేర్కొన్నారు. నీటి వృధాను అరికట్టాల్సిందిగా పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతున్నామని, పౌరులు తమ వంతు కృషి అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం కూడా తమ వంతు మద్దతు ప్రకటించాలని అన్నారు.

దిల్లీలో రాయితీ ధర రూ.65కి కిలో టమాటా

న్యూదిల్లీ : సామాన్యులకు ఉపశమనం కలిగించడానికి, దళారులకు అసాధారణ లాభాలకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సోమవారం దేశ రాజధానిలో కిలో రూ.65 చొప్పున రాయితీ ధరతో టమాటాలను విక్రయించడం ప్రారంభించింది. కాగా, ఢిల్లీలో సగటున కిలో రూ.90 చొప్పున టమాటా విక్రయిస్తున్నారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్) వ్యాన్‌ల ద్వారా కిలో రూ.65 చొప్పున టమాటా విక్రయించే కార్యక్రమాన్ని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే జెండా ఊపి ప్రారంభించారు. 'మేము టమాటా ధరలను సరళతరం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఈ మార్కెట్ జోక్యంతో రాబోయే 3-4 రోజుల్లో టమాటా ధరలు తగ్గుతాయి' అని ఖరే ఇక్కడ విలేకరులతో అన్నారు. మండీల నుంచి నేరుగా టమాటాలను సేకరించి కిలోకు రూ.65 సబ్సిడీ ధరకు విక్రయించింది.

ఆందోళన చెందొద్దు... క్షేమంగానే ఉన్నా

అనారోగ్య వార్తలను ఖండించిన రతన్ టాటా

న్యూఢిల్లీ : ప్రముఖ వ్యాపారవేత్త, టాటా సన్స్ మాజీ ఛైర్మన్ రతన్ టాటా తీవ్ర అస్వస్థతకు గురైనట్లు వార్తలు వస్తున్నాయి. రక్తపోటు తగ్గిపోవడంతో వెంటనే ఆయనను ముంబైలోని బ్రీచ్‌కాండీ ఆసుపత్రికి తరలించారని, ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. దీంతో అనేక మంది ప్రముఖులు, అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అస్వస్థత వార్తలపై రతన్ టాటా స్పందించారు. 'ఇటీవల నా ఆరోగ్యం గురించి పుకార్లు వ్యాపించాయని నాకు తెలుసు. ఈ వార్తలన్నీ నిరాధారమైనవి. నా వయస్సు రీత్యా వచ్చిన ఆరోగ్య పరిస్థితుల కారణంగా నేను ప్రస్తుతం వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాను. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను క్షేమంగానే ఉన్నాను. నా ఆరోగ్యంపై ఆందోళన చెందిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని రతన్ టాటా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'ఆందోళనకు కారణం లేదు. నేను మంచి ఉత్సాహంతో ఉన్నాను. ప్రజలు, మీడియా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా ఉండవలసిందిగా అభ్యర్థిస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు, ముంబై టాబ్లాయిడ్ మిడ్ డేతో సహా కొన్ని ప్రచురణలు, జర్నలిస్టులు 86 ఏళ్ల టాటా సన్స్ మాజీ ఛైర్మన్ పరిస్థితి విషమంగా ఉన్నందు ఆస్పత్రికి తరలించారని సోషల్ మీడియాలో నివేదించాయి.

కాంగ్రెస్‌ను నమ్మొద్దు: రిజిజు

న్యూఢిల్లీ: ముస్లింలను ఏమారుస్తూ హిందువుల్లో చీలికలు తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ముస్లింలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని చెప్పారు. 'ఎన్నికల సమయంలో 15 శాతం ఓట్లు కచ్చితంగా తమకేనని కాంగ్రెస్ చెప్పుకుంటుంది. ఇది ఆ పార్టీ ఆలోచనా ధోరణికి అద్దం పడుతోంది. ముస్లింలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా చూస్తుంది. ఇది ముస్లింలకు భారీ నష్టం చేస్తోంది' అని జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజిజు చెప్పారు. తాజాగా ఆ వీడియోను ఎక్స్ వేదికగా పంచుకున్న మంత్రి రిజిజు... 'ముస్లింలకు నేను చేసే హెచ్చరిక ఏమిటంటే.. మీరు కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా మారకండి. హిందువులు, ఇతరులకు హెచ్చరిక ఏంటంటే... మీరు కాంగ్రెస్ అనుసరిస్తున్న విభజించి పాలించే విధానానికి బాధితులుగా మిగలొద్దు' అని వ్యాఖ్యానించారు. ముస్లింలు ఎప్పటికీ తమకే ఓటు వేస్తారని కాంగ్రెస్ భావిస్తుంటుందని మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఇలాంటి ఆలోచనా తీరుతో ముస్లిం సామాజిక వర్గం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు.

బీజేపీ పగటి కలలు

హర్యానా ఫలితాలపై సీపీఎం నేత మొల్లా

న్యూఢిల్లీ: హర్యానా ఎన్నికల్లో గెలుపుపై బీజేపీ కలలు కంటోందని సీపీఐ నేత హన్నన్ మొల్లా అన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటన సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ ఇప్పటికే చెప్పాయని ప్రకటించారు. ఎగ్జిట్ పోల్స్ అనంతరం కూడా హర్యానాలో వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని బీజేపీ చెప్పుకోవడం హాస్యాస్పదమని హన్నన్ మొల్లా అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కలలు కనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఇప్పుడు బీజేపీ కూడా అదే పనిచేస్తోంది. హర్యానాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బీజేపీ కలలు కంటోంది. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వకపోవడం, వారి డిమాండ్లు అంగీకరించకపోవడం వంటి సమస్యలు హర్యానా రైతులను తీవ్ర ఆందోళనలకు గురిచేశాయి. రైతుల్లో వెల్లువెత్తిన నిరసనలను దేశమంతా చూసింది. అందుకే హర్యానా రైతుల్లో బీజేపీ పట్ల వ్యతిరేకత నెలకొంది. అక్టోబర్ 8న వెలువడే ఎన్నికల ఫలితాలు ఇండియా ఐక్యసంఘటనకు అనుకూలంగా, బీజేపీకి వ్యతిరేకంగా ఉంటాయి' అని ఆయన అన్నారు. రైతు నేత రాకేశ్ తికైత్ మాట్లాడుతూ 'బీజేపీ ప్రభుత్వం రైతులపై లాఠీ ప్రయోగించింది. ఆ ప్రభుత్వం ఇకపై అధికారంలో కొనసాగదు. ఇలాంటి దుర్మార్గపు చర్యలు ఎన్ని చేసినా... పోలీసులపై రైతులు లాఠీఛార్జీ చేయరు. కానీ బీజేపీ ప్రభుత్వం చేసిన పనులు గుర్తుంచుకొని ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకుంటారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 50-58, బీజేపీ 20-28, ఇతర పార్టీలు 10-16 సీట్లలో గెలుస్తాయని ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి.

పలస్తీనాపై దాడులను అడ్డుకోవాలి

- ఆయా దేశాలతో ఐరాస అత్యవసర సమావేశాలు జరపాలి
- అమెరికా పంచన చేరేందుకు మోదీ తహతహ
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల
- రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వెంటనే నిలిపివేయాలని, యుద్ధాన్ని ప్రోత్సహించే అమెరికా చర్యలను ప్రపంచ దేశాలు నిరసించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వామపక్షాల అధ్వర్యంలో సోమవారం పలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విజయవాడలో ఉదయం సదస్సు, సాయంత్రం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో గాంధీ పార్క్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ముప్పాళ్ల పాల్గొని ప్రసంగించారు. సంవత్సర కాలంగా ఈ దేశాల మధ్య ఉన్న అనేక అంతర్గత సమస్యలకు నేడు జరుగుతున్న మారణ హోమ యుద్ధం పరిష్కారం కాదన్నారు. ఈ యుద్ధం వలన పసిపిల్లలు, వృద్ధులు, మహిళలు దాదాపు 85 వేల మంది అమాయకులు మరణించారని, మరోపక్క లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో జరిగే యుద్ధాలకు ఆజ్యం పోస్తున్న అమెరికా మరింత యుద్ధ సామాగ్రిని, సైన్యాలను పంపించి ఆయా దేశాలను ఇంకా రెచ్చగొడుతోందని మండిపడ్డారు. ఐక్యరాజ్యసమితి అత్యవసర సమావేశాలు నిర్వహించి వెంటనే యుద్ధాన్ని నిలువరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరాన్ పాత్ర చూస్తుంటే మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే విధంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోని ఆయిల్ ఉత్పత్తులపై పెత్తనం సాగించాలన్న అమెరికా ధోరణి ఈ యుద్ధాలకు కారణం అవుతోందని తెలిపారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పంచన చేరాలని కుతూహల పడుతున్నారని విమర్శించారు. ఐక్యరాజ్య సమితిలో ఈ యుద్ధానికి వ్యతిరేకంగా తక్షణమే తీర్మానం చేయాలని, అందులో భారత్ పాల్గొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు డి.శివకుమారి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఎంసీపీఐయూ జిల్లా నాయకులు రెడ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అండతోనే పేట్రేగుతున్న ఇజ్రాయెల్ : సీపీఎం శ్రీనివాసరావు

పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ విశాఖపట్టణంలో బంగారు నగల షాపు నుంచి ఆశీలు మెట్ట జంక్షన్ వరకు శాంతి ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ప్రసంగించారు. అమెరికా అండతోనే ఇజ్రాయిల్ పేట్రేగిపోతోందని మండిపడ్డారు. పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులతో మారణహోమం ప్రారంభించి నేటికి ఏడాదైందన్నారు. ఐక్యరాజ్య సమితి అక్కడ శాంతిని నెలకొల్పాలని ఇజ్రాయిల్‌ను ఆదేశించినా అమెరికా మద్దతుతో చెలరేగిపోతోందని తెలిపారు. ప్రపంచం వ్యాప్తంగా ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తున్నా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు మాత్రం చలనం లేదని విమర్శించారు. శాంతికాముకులందరూ పలస్తీనా ప్రజలకు అండగా ఉండాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు, కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె.శంకర్రావు, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకుడు దేవా తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని, అమెరికా సామ్రాజ్యవాదం దౌర్జన్యాన్ని ఖండిస్తూ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా వామపక్షాలు కాకినాడలో కలెక్టరేట్ నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించాయి. అనంతరం సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన నిరసన సభను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగల ప్రభాకర్ మాట్లాడారు. ఇజ్రాయిల్‌కి ఆయుధాలు అమ్ముకుంటూ యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికా సామ్రాజ్యవాద వైఖరిని ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. న్యూ డెమోక్రసీ నాయకుడు జె.వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) నాయకులు ఆదినారాయణ, కాకినాడ జిల్లా సీపీఐ కార్యదర్శి కె.బోడకొండ, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు దూసర్లపూడి రమణరాజు తదితరులు ప్రసంగించారు.

మహిళ హత్య కేసులో నందిగం సురేశ్ అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బాపట్ల వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ మరో కేసులో అరెస్టయ్యారు. ఇప్పటికే టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న ఆయనపై వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్య కేసు నమోదైంది. ఈ కేసులో నందిగం సురేశ్‌ను పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించింది. 2020లో వెలగపూడిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మరియమ్మ అనే మహిళ మరణించింది. అప్పట్లో ఈ ఘటనపై హత్య కేసు నమోదు చేశారు. ఇందులో ఎంపీ నందిగం సురేశ్ పేరును చేర్చారు. టీడీపీ కార్యాలయంలపై దాడి కేసులో ఇటీవల సురేశ్‌కు హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. దానికి పూచీకత్తును సకాలంలో సమర్పించకపోవడంతో సురేశ్ జైలులోనే ఉన్నారు. మంగళగిరి కోర్టు పీటీ వారెంట్‌కు అనుమతించడంతో... మరియమ్మ హత్య కేసులో సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి న్యాయస్థానంలో ఆయనను ప్రవేశ పెట్టగా ఈనెల 21 వరకు నందిగంకు రిమాండ్ విధించింది.

లాభాల బాటలో ఆర్టీసీ: మునిరత్నం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లాభాల బాటలో ఆర్టీసీని నడిపించేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ సీఎస్ మునిరత్నం అన్నారు. విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో వైస్ చైర్మన్‌గా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం ఆర్టీసీ బస్సులను నడుపుతున్న ఘనత ఆర్టీసీ సంస్థకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ఉచిత బస్సు పథకాన్ని సీఎం ఆదేశాలతో అమలు చేస్తామని చెప్పారు. వైఎస్ చైర్మన్ పదవికి వన్నె తెస్తానన్నారు. చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో కలసకట్టుగా ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కార్మికులు, ఉద్యోగుల సహకారంతో అభివృద్ధిలో దూసుకుపోయేలా పనిచేస్తామన్నారు. సహ ఉద్యోగులు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం మానవత్వానికి నిదర్శనమని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నవంబర్ 26న రైతు ప్రదర్శనలు

దక్షిణ భారతదేశ రాష్ట్రాల ఎస్‌కేఎం సమావేశం పిలుపు

బెంగళూరు: ఎస్‌కేఎం దక్షిణభారతదేశ రాష్ట్రాల సమావేశం బెంగళూరులో ప్రారంభమైంది. రెండురోజులు జరిగే ఈ సమావేశం దక్షిణాదిలో ఎస్‌కేఎం అధ్వర్యంలో పోరాటాలను ముందుకు తీసుకువెళ్లడంపై చర్చించింది. ఉదయం సెషన్‌కు రైతుసంఘం నాయకులు డాక్టర్ సునీలం, దర్శన్ పాల్, రావుల వెంకయ్య, జీసీ భయ్యారెడ్డి (కర్నాటక), కె.బాలకృష్ణ(తమిళనాడు), పశ్యపద్మ (తెలంగాణ), కె.కేశవరావు(ఏపీ), ఫ్రాన్సిస్ (కేరళ)అధ్యక్షత వహించారు. రైతాంగ ఉద్యమంలో మరణించిన, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌ఖేరిలో హత్యకు గురైన రైతులకు జోహార్లు తెలియజేస్తూ డాక్టర్ సునీలం సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సాగిన ఉద్యమం గురించి, నేటి వరకు నిర్వహించిన కార్యక్రమాల నివేదికను దర్శన్‌పాల్ ప్రవేశపెట్టారు. రాష్ట్రాలలో నిర్వహించిన కార్యక్రమాలపై జరిగిన సమావేశానికి పశ్య పద్మ, కె.కేశవరావు అధ్యక్షత వహించారు. తమిళనాడు నుంచి కె.బాలకృష్ణ, తెలంగాణ నుండి టి.సాగర్, కేరళ నుండి శంకరన్, కర్నాటక నుండి బడగండ్లపుర నాగేందర్, ఏపీ నుండి కేశవరావు మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు, ఎస్‌కేఎం భవిష్యత్ కర్తవ్యాలపై విజ్జు కృష్ణ మాట్లాడారు. దేశవ్యాపితంగా అన్ని జిల్లాలలో నవంబర్ 26వ తేదీన రైతాంగ ఉద్యమం ప్రారంభమైన రోజున రైతుల ప్రదర్శనలు విజయవంతం చేయాలని కోరారు. సాయంత్రం జరిగిన సెషన్‌కు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వేములపల్లి వెంకట్రామయ్య, రంగయ్య, వల్సన్ పనోలి అధ్యక్షత వహించారు. వేములపల్లి వెంకట్రామయ్య, శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమాన్ని పటిష్టవంతం చేయటం ద్వారా డిమాండ్లు సాధించుకోగలుగుతామని, అందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాల నుండి వివిధ సంఘాల ప్రతినిధులు చర్చలలో పాల్గొని ఉద్యమ పటిష్టతకు అనేక సూచనలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సంఘం నుండి గడ్డం మురళీధర్‌రెడ్డి మాట్లాడారు.

బీహార్, మణిపూర్ ఎందుకు వెళ్లరు?

మోదీని ప్రశ్నించిన నారాయణ

న్యూఢిల్లీ: 'బీహార్‌లో వరద ప్రాంతాల్లో ఐదు రోజులపాటు పర్యటించాం. 22 జిల్లాల్లో వరద బీభత్సం సృష్టించింది. ముఖ్యంగా 12 జిల్లాల్లో తీవ్ర ప్రభావం చూపింది. మరో 10 జిల్లాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దాదాపు నాలుగైదు లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి' అని సీపీఐ కార్యదర్శి డా.కె.నారాయణ చెప్పారు. నారాయణ సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వరదలకు కొన్ని ఇళ్లు నీటిలో మునిగిపోయాయన్నారు. 'బీహార్ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి. బీహార్ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించలేదు. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల పంట పూర్తిగా నాశనమైంది. వరదల్లో కొట్టుకుపోయిన కొంతమంది మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. ఇంత భయానక పరిస్థితుల్లోనూ మోదీ ఆ రాష్ట్రంలో పర్యటన చేయలేదు. బీహార్‌లో పర్యటించరు... రావణకాష్టంలా మండుతున్న మణిపూర్ వెళ్లరు. కానీ విదేశాలకు వెళుతూ విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు' అని నారాయణ విమర్శించారు. మోదీ ఇజ్రాయిల్‌ను ఆదర్శగా తీసుకున్నారని మండిపడ్డారు. మరోవైపు, అత్యాచార నిందితులకు తేలికగా బెయిల్ లభిస్తోందని, డేరా బాబాకు పదేపదే పెరోల్ ఇవ్వడం ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎన్నికల కోసం డేరా బాబాకు పెరోల్ లభించిందన్నారు. హర్యానా ఎన్నికల సమయంలోనే ఆయన బయటకు వచ్చారన్నారు. కానీ వరవరరావు వంటి వాళ్లకు మాత్రం బెయిల్ రాదని అన్నారు. వరవరరావుకు బెయిల్ ఇచ్చినప్పటికీ ముంబైలోనే ఉండాలంటూ షరతులు విధిస్తున్నారని ఆరోపించారు. జమ్మూకశ్మీరులో దొడ్డిదారిన ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని నారాయణ విమర్శించారు. ఫలితాలకు ముందే ఐదుగురిని ఎమ్మెల్యేలుగా నామినేట్ చేశారని మండిపడ్డారు.

ప్రజల మద్దతు బీజేపీకి ఉంటే ఇలా ఎందుకు చేస్తుందని ఆయన ప్రశ్నించారు. మరోవైపు నక్సలిజంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్వహించిన సమావేశంపై నారాయణ స్పందించారు. దేశంలో అత్యాచారాలు, హత్యలు కొనసాగుతున్నాయని, వాటిపై అమిత్‌షా దృష్టి కేంద్రీకరించాలని హితవు పలికారు. మావోయిస్టులు సైతం సానుకూలంగా ఆలోచించాలని, మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమాల్లో మార్పులు తెచ్చుకోవాలన్నారు. ప్రజలతో కలిసి పోరాడాలని సూచించారు.



మోదీతో మయిజ్జు భేటీ

ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృత చర్చలు

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఇక్కడ మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ మయిజ్జు కలిశారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంపై విస్తృత చర్చలు జరిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం సాయంత్రం మయిజ్జు ఇక్కడకు చేరుకున్నారు. 'భారత్-మాల్దీవుల ప్రత్యేక సంబంధాలను ముందుకు తీసుకవెళుతున్నాం. హైదరాబాద్ హౌస్‌కు చేరుకున్న మాల్దీవుల అధ్యక్షుడిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సాదరంగా ఆహ్వానించారు. భారత్-మాల్దీవుల ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృత చర్చలు జరగబోతున్నాయి' అని విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, మయిజ్జుకు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వాగతం పలికారు. ప్రధాన మంత్రి మోదీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించేందుకు రాజ్‌ఘాట్‌కు వెళ్లే ముందు మయిజ్జుకు త్రివిధ దళాలు గౌరవవందనం స్వీకరించారు. సమావేశం అనంతరం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో మయిజ్జు మాట్లాడుతూ తనని భారత్‌కు ఆహ్వానించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు కూడా కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. మాల్దీవులలో పర్యటించే వారిలో భారతీయులే అధికం కావడంతో వీరి సమావేశంలో పర్యాటక అంశం కూడా ప్రధానంగా చర్చకొచ్చింది. ఇప్పటికే ఎంతో మంది భారతీయులు మాల్దీవులను సందర్శిస్తుంటారని, భవిష్యత్‌లో మరింత మంది సందర్శిస్తారని కోరుకుంటున్నానని మయిజ్జు అన్నారు. 'మాల్దీవులకు అవసరం వచ్చిన ప్రతిసారి భారత్ వెన్నంటి ఉంది. స్నేహ హస్తం అందిస్తోంది. అలాగే తమ దేశ ఆర్థికాభివృద్ధిలో భారత్‌ది ఎంతో కీలక పాత్ర' అని మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ మయిజ్జు అభిప్రాయపడ్డారు. ఏళ్ల తరబడి మాల్దీవులకు అండగా నిలుస్తోన్న ప్రధాని మోదీతో పాటు భారతీయులకు తాను కృతజ్ఞతలు చెప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ భారత్, మాల్దీవుల బంధం వందల ఏళ్ల నాటిదన్నారు. గత ఏడాది నవంబరులో పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మయిజ్జు భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ప్రధాని మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారోత్సవం కోసం జూన్‌లో ఆయన దిల్లీ వచ్చారు. చైనా అనుకూలుడిగా పేరొందిన మయిజ్జు నవంబరులో ఆ దేశ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భారత్-మాల్దీవుల మధ్య సంబంధాలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. 'ఇండియా ఔట్' ప్రచారంలో మయిజ్జు గత సంవత్సరం అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ ఏడాది మే నాటికి ద్వీపసమూహంలో నియమించబడిన సైనిక సిబ్బందిని ఉపసంహరించుకోవాలని న్యూఢిల్లీని కోరింది. మాల్దీవుల మంత్రులు మోదీని విమర్శించడంతో ద్వైపాక్షిక సంబంధాలు కూడా దెబ్బతిన్నాయి. అయితే మయిజ్జు తన భారత వ్యతిరేక వైఖరిని తగ్గించారు. భారత ప్రధానిని విమర్శించే మంత్రులను కూడా తొలగించారు. మాల్దీవులు తీవ్రమైన ఆర్థిక మాంద్యంతో సతమతమవుతున్నందున ఆ దేశానికి కీలకమైన బడ్జెట్ మద్దతును అందించాలని భారతదేశం నిర్ణయించింది.

పేదల అభ్యున్నతికి శంకరన్ కృషి

జయంతి, వర్ధంతిని ప్రభుత్వం నిర్వహించాలి

జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: పేదల సంక్షేమమే జీవిత ధ్యేయంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు రూపకల్పన చేసి ప్రభుత్వాధినేతలను ఒప్పించి, వాటి అమలు కోసం నిర్విరామంగా కృషి చేసిన చిరస్మరణీయులు ఎస్ఆర్ శంకరన్ అని శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఐఏఎస్ గాంధీగా ప్రజలు, అధికారుల చేత కీర్తించబడిన శంకరన్ 14వ వర్ధంతి శంకరన్ మెమోరియల్ కమిటీ అధ్వర్యంలో సోమవారం స్థానిక ఐక్యతా భవన్‌లో గల శంకరన్ కాంస్య విగ్రహం వద్ద జరిగింది. కమిటీ కోకన్వీనర్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ బడుగు జీవుల కోసం పరితపించిన శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఐఏఎస్ అధికారిగా వివిధ పదవీ బాధ్యతలు నిర్వహించిన శంకరన్ నిరాడంబరంగా జీవించారని కొనియాడారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంక్షేమం అనే పదానికి అసలైన అర్థం తీసుకువచ్చిన ఘనత ఆ మహనీయుడికే దక్కిందన్నారు. కమిటీ కోకన్వీనర్, కులవివక్ష పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ జీవితాంతం బ్రహ్మచారిగా జీవించారని, ఉన్నత వర్గానికి చెందిన శంకరన్ పేదల కోసం పాటుబడటం అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. ఎస్సీ, ఎస్టీ రైల్వే ఫెడరేషన్ నాయకులు కొండల రావు, డాక్టర్ అంకయ్య, బీఎస్ఎన్ఎల్ నాయకులు విల్సన్, దళిత స్త్రీశక్తి రాష్ట్ర కార్యదర్శి గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ శంకరన్ పేరు చెబితే సంక్షేమ పథకాలు గుర్తొస్తాయని, పేదల ప్రజలు ఆయనను అమితంగా అభిమానించే వారని చెప్పారు. శంకరన్ వంటి మహనీయుల అడుగుజాడల్లో ప్రభుత్వాలు ప్రజల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ముందుగా శంకరన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు పి.రాము, పి.రాజు, రాహెల్‌బాబు, కుమార్, గుప్తా, కేవీపీఎస్ నాయకులు నటరాజ్, శ్రీను, అరుణ, ఆర్ఎంయూఓ నాయకులు జయకుమార్, దాసరి సుబ్రమ్మణ్యం, ఐక్యతా భవన్ సిబ్బంది పాల్గొన్నారు. డీహెచ్‌పీఎస్ విజయవాడ నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య వందన సమర్పణ చేశారు.

తుది దశకు నక్సల్స్ తీవ్రవాదం

సీఎంల భేటీలో అమిత్ షా

న్యూఢిల్లీ: దేశంలో నక్సల్స్ తీవ్రవాదం తుదిదశకు చేరుకుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. సోమవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అమిత్ షా అధ్యక్షతన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్ హాజరయ్యారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గైర్హాజరు కాగా... ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, సీఎస్ నీరభ్ ప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు. వీరితోపాటు బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఇక కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిత్యానందరాయ్, జుయెల్ ఓరం, సంబంధిత శాఖకు చెందిన కేంద్ర అధికారులు కూడా పాల్గొన్నారు. అమిత్‌షా మాట్లాడుతూ... మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 13 వేల మందికి పైగా నక్సల్స్ ఆయుధాలు వదిలేసి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 2024లో 202 మంది మావోయిస్టులు మృతిచెందగా.. 723 మంది ప్రభుత్వానికి లొంగిపోయారని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల లభించిన భారీ విజయం అందరికీ ప్రేరణగా నిలుస్తుందని... అక్కడ కొందరు మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్న అమిత్ షా... భవిష్యత్తులో మరింత స్ఫూర్తితో ఒకే లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చేందుకు అన్ని రాష్ట్రాలు సహకరించాలని ఈ సందర్భంగా అమిత్ షా పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ సీఎం, డీజీపీని అమిత్ షా అభినందించారు. నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల సీఎంలు, డీజీపీలు 15 రోజులకు ఒకసారి నక్సల్ నిర్మూలనపై రివ్యూ మీటింగ్ నిర్వహించాలని అమిత్ షా ఆదేశించారు. అంతేకాకుండా మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో డీజీపీలు పర్యటించాలని.. 2026 నాటికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. 10 ఏళ్లలో కేంద్రంలోని మోదీ సర్కార్ చేసిన అభివృద్ధి గురించి వివరించారు. 11,500 కిలోమీటర్ల మేర రోడ్ నెట్‌వర్క్‌తో పాటు 15,300 సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 165 ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు కొత్తగా నెలకొల్పినట్లు తెలిపారు. గతంలో 16,400కు పైగా హింసాత్మక ఘటనలు జరగ్గా.. ప్రస్తుతం 7,700లకు తగ్గాయని వెల్లడించారు. ప్రజలు, భద్రతా బలగాల మరణాలు 70 శాతం తగ్గాయని పేర్కొన్నారు. హింసాత్మక ప్రభావిత జిల్లాలు 96 నుంచి 42కు తగ్గినట్లు చెప్పారు. హింసాత్మక ఘటనలు నమోదయ్యే పోలీస్ స్టేషన్ల సంఖ్య 465 నుంచి 171కి పడిపోయినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సమన్వయంతోనే ఇది సాధ్యమైందని అమిత్ షా వెల్లడించారు. 2014 నుంచి ఇప్పటివరకు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రూ.3006 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మావోయిస్టు తీవ్రవాదాన్ని 2026వరకు సమూలంగా అంతం చేయాలని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలను మరింత ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది మొదటినుంచి భారీగా నక్సల్స్ ఏరివేత ఆపరేషన్లను చేపడుతోంది. ఈ ఆపరేషన్లలో భాగంగానే ఈ ఏడాది ప్రారంభం నుంచి ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 202 మంది మావోయిస్టులను హతం చేసింది. 801 మందిని అరెస్టు చేయగా.. 742 మందిని భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఇక ఈ గణాంకాలను స్వయంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు.

మాతో చర్చించాల్సిందే...

బీజేపీ ఎన్నికల వాగ్దానం గుర్తు చేసేందుకు వచ్చా

లదాఖ్ భవనం వద్ద దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత నాయకత్వంతో చర్చించేందుకు ఎప్పుడు వస్తారో అధికారులు చెప్పే వరకు తాను, తన మద్దతుదారులు లదాఖ్ భవనం వద్దే వేచి ఉంటామని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ సోమవారం స్పష్టం చేశారు. లదాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్న నిరసనకారులు అసాధారణంగా ఏమీ అడగడం లేదని, అధికార బీజేపీకి ఎన్నికల వాగ్దానాన్ని గుర్తు చేయడానికి ఇక్కడకు వచ్చారని ఆయన అన్నారు. ఆరవ షెడ్యూల్ అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల పరిపాలనను 'స్వయంప్రతిపత్తిగల జిల్లాలు, స్వయంప్రతిపత్తి గల ప్రాంతాలు' గా పేర్కొంటోంది. వాంగ్‌చుక్, ఆయన మద్దతుదారులు ఆదివారం లద్దాఖ్ భవనం వద్ద తమ నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. 'మేము మా నాయకులను ఎప్పుడు కలుస్తాం అనే దానిపై సమాధానం వచ్చే వరకు మేము ఇక్కడ కూర్చుంటాం. మేము 30-32 రోజులు నడిచాం. కనీసం సమావేశానికి అయినా మేము అర్హత కలిగి ఉన్నాం' అని వాంగ్‌చుక్ పీటీఐకి చెప్పారు. లదాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతించారు. ఎందుకంటే వారికి శాసనసభ, ఆరవ షెడ్యూల్‌లో చేర్చడం వంటి వాగ్దానాలు' అని పర్యావరణ కార్యకర్త చెప్పారు. 'మేము అసాధారణంగా ఏమీ అడగడం లేదు. బీజేపీ తన మ్యానిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని గుర్తు చేయడానికి మేము ఇక్కడకు వచ్చాం' అని అన్నారు. వాంగ్‌చుక్, ఆయన మద్దతుదారులు తమ డిమాండ్లను నొక్కిచెప్పేందుకు లేహ్ నుంచి దిల్లీకి పాదయాత్ర చేశారు. అయితే దిల్లీ పోలీసులు సెప్టెంబరు 30న రాజధాని సింఘు సరిహద్దులో వారిని నిర్బంధించారు. 'దిల్లీ చలో పాదయాత్ర' కు లేహ్ అత్యున్నత మండలి (ఎల్ఏబీ) నాయకత్వం వహిస్తోంది. నిరసనకారులను అక్టోబరు 2 రాత్రి దిల్లీ పోలీసులు విడుదల చేశారు. కాగా, ఆదివారం వాంగ్‌చుక్ లదాఖ్ భవనం నుంచి సాయంత్రం 4 గంటలకు బయటకు వచ్చి తాను నిరాహార దీక్షకు కూర్చున్నట్లు ప్రకటించారు. దీంతో ఆదివారం లదాఖ్ భవన్ వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేసి ప్రవేశంపై ఆంక్షలు విధించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.